# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com






ఏలూరు | సంపుటి:01 | సంచిక:87 | ఆదివారం | మార్చి 23, 2025 | ఎడిటర్:రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు :8 | వెల:రూ 5/-

published from Eluru, Kadapa,Kakinada, Vijayawada, Ananthapuramu, Circulated at AndhraPradesh & Telangana


## నిధులు వచ్చేందుకు చర్యలుచేపట్టండి

### -ఆర్థిక శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష



ప్రజాభూమి ప్రతినిధి,హైదరాబాద్-

రాష్ట్ర ఆర్థిక శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష చేశారు. మరో వారంరోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఆర్థిక శాఖలో స్థితిగతులపై చర్చించారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై అధికారులతో రివ్యూ చేశారు. కేంద్రంలోని ఆయా శాఖల నుంచి రావాల్సిన నిధులు వచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర పథకాలకు సంబంధించి అవసరమైన సమగ్ర సమాచారాన్ని అందించి...సకాలంలో నిధులు విడుదల అయ్యేలా చూడాలని అధికారులకు సీఎం సూచించారు. కేంద్ర పథకాలకు సంబంధించి 5 శాఖల నిధులు రావాల్సి ఉందని అధికారులు తెలపగా..... కేంద్రంతో సంప్రదింపులు జరిపి ఆర్థిక సంవత్సరం ముగింపులోగా నిధులు తెచ్చుకోవాలని తెలిపారు. హైదరాబాద్ లోని సిఎం నివాసంలో జరిగిన ఈ రివ్యూకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక శాఖ సెక్రటరీ రోనాల్డ్ రోస్ హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, సిఎంవో అధికారులు పాల్గొన్నారు.



2

## ప్రజలకు ఆర్థిక స్థిరత్వ కల్పన

## కూటమి ప్రభుత్వ లక్ష్యం

-రాష్ట్ర అభివృద్ధిపై సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం

-ఉపాధి హామీ పనులతో అన్నదాతల కళ్లలో వెలుగు చూడాలి

-గత ప్రభుత్వం పంచాయతీ రాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసింది

-కూటమి ప్రభుత్వం వ్యవస్థలను పటిష్టపరుస్తూ ముందుకు వెళ్తోంది

-త్వరలో జిల్లాల్లో పర్యటనకు ప్రణాళికలు

-కొణిదెల గ్రామంలో అభివృద్ధి పనులకు సొంత ట్రస్ట్ నుంచి రూ. 50 లక్షల నిధులు

-కర్నూలు జిల్లా, పుడిచర్లలో ఫామ్ పాండ్స్ నిర్మాణానికి భూమి పూజ చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

రాష్ట్రవ్యాప్తంగా లక్షా 55 వేల ఫామ్ పాండ్స్ నిర్మాణానికి శ్రీకారం

## ఆ వార్తలు కేవలం ఊహాగానాలు.. లేఖ విడుదల చేసిన జనసేన

2

## డీలిమిటేషన్‌తో సౌత్ రాష్ట్రాలకు అన్యాయం..

## స్వదేశంలో రాజకీయ అధికారం కోల్పోతున్నాం

### డీలిమిటేషన్‌పై డీఎంకే ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం- జేఏసీ సమావేశానికి వ్యతిరేకంగా బీజేపీ ఆందోళనలు




చెన్నై:ప్రస్తుత జనాభా ప్రకారం లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియను ముక్తకంఠంతో వ్యతిరేకించాలని కోరారు. ఈ అంశంపై కేంద్రం ప్రకటనలు గందరగోళానికి తావిచ్చేలా ఉన్నాయని సీఎం స్టాలిన్ అన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగనుందన్న విషయమై చర్చించేందుకు డీఎంకే ఆధ్వర్యంలో జరుగుతున్న అఖిలపక్ష సమావేశంలో సీఎం స్టాలిన్ ఈ మేరకు మాట్లాడారు.'2026లో జరిగే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై నిర్వహిస్తున్న ఈ సమావేశం చరిత్రలో నిలిచిపోతుంది. ప్రస్తుత జనాభా ప్రకారం డీలిమిటేషన్ జరిగితే నష్టం. అందుకే దీనిని వ్యతిరేకించాలి. పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గితే, అభిప్రాయాలు వ్యక్తంచేసే బలం తగ్గుతుంది. కేంద్రం నుంచి రాష్ట్రాలకు వచ్చే నిధుల కోసం పోరాటం చేయాల్సి వస్తుంది. మన సమ్మతితో సంబంధం లేకుండానే చట్టాలు రూపొందుతాయి. ఆ నిర్ణయాలు మన ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. విద్యార్థులు అవకాశాలు కోల్పోవాల్సి వస్తుంది. రైతులకు మద్దతు కొరవడుతుంది. మన సంప్రదాయాలు, వృద్ధి ప్రమాదంలో పడటమే కాకుండా సామాజిక న్యాయం దెబ్బతింటుంది. ఈపరిణామాలతో స్వదేశంలో మనం రాజకీయ అధికారం కోల్పోయిన పౌరులుగా మిగిలిపోవాల్సి వస్తుంది. తమ నిరసన పునర్విభజనకు వ్యతిరేకంగా కాదు. న్యాయబద్ధంగా, పారదర్శంగా డీలిమిటేషన్ చేయాలని మనం డిమాండ్ చేస్తున్నాం' అని స్టాలిన్ తెలిపారు.

**అలా జరిగితే మనకు డేంజర్ బెల్**

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన వేలాడుతున్న కత్తి లాంటిదని కేరళ సీఎం పినరయి విజయన్ అన్నారు. ఈ అంశంపై రాష్ట్రాలను సంప్రదించకుండా కేంద్రప్రభుత్వం ఏకపక్షంగా ముందుకు వెళ్తోందని ఆరోపించారు. అలా జరిగితే మనకు డేంజర్ బెల్ లాంటిదేనని పేర్కొన్నారు. పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధ్యం తగ్గితే ఆర్థికంగా, రాజకీయంగా నష్టం తప్పదని కేరళ సీఎం విజయన్ అన్నారు. ఈ విషయాన్ని మనం ఎన్నటికీ అనుమతించకూడదని అన్నారు.

**'డీలిమిటేషన్ కోసం పోరాడతాం'**

భేటీ తర్వాత సమావేశం వివరాలను డీఎంకే ఎంపీ కనిమొళి వివరించారు. 'దేశ రాజకీయ యవనికపై చారిత్రక పరిణామం ఇది. దేశవ్యాప్తంగా అద్భుతమైన స్పందన లభించింది. అనేక మంది నేతలు, ముఖ్యమంత్రులు దేశవ్యాప్తంగా ఉన్న వివిధ పార్టీల నేతలు మద్దతు ఇచ్చారు. మా సీఎం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. వారంతా తమ సంఘీభావం తెలిపేందుకు ఒకే వేదికపైకి వచ్చారు. ముఖ్యమైన డీలిమిటేషన్‌పై వారు తమ ఆందోళనలు వ్యక్తంచేశారు. పారదర్శక డీలిమిటేషన్ కోసం పోరాడాలనే ఏకాభిప్రాయానికి వచ్చాం' అని కనిమొళి తెలిపారు.

**నల్ల దుస్తులతో బీజేపీ నిరసనలు**

మరోవైపు సీఎం స్టాలిన్ నిర్వహిస్తున్న జేఏసీ సమావేశానికి వ్యతిరేకంగా తమిళనాడు వ్యాప్తంగా బీజేపీ ఆందోళనలు చేపట్టింది. ఆ పార్టీ శ్రేణులు నల్ల దుస్తులు ధరించి నిరసనకు దిగారు. కావేరి, ముల్లైపెరియార్ నదీవివాదాలకు సంబంధించి కర్ణాటక, కేరళతో సీఎం స్టాలిన్ ఇలాంటి సమావేశాలు ఎందుకు నిర్వహించటం లేదని ప్రశ్నించారు.

మిగతా 2లో

## పన్నుల రూపంలో భారీగా చెల్లిస్తున్నప్పటికీ తక్కువ మొత్తంలో తిరిగి పొందుతున్నాం

-జనాభా ఆధారిత పునర్విభజనను వ్యతిరేకిస్తున్నామన్న రేవంత్ రెడ్డి

-పారదర్శకంగా లేని ఈ విధానంపై బీజేపీని కట్టడి చేయాల్సిన అవసరం ఉందన్న సీఎం

-ఉత్తరాది రాష్ట్రాల ఆధిపత్యాన్ని అంగీకరించబోమన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

చెన్నై:పన్నుల రూపంలో కేంద్ర ప్రభుత్వానికి భారీగా చెల్లిస్తున్నప్పటికీ తక్కువ మొత్తంలో తిరిగి పొందుతున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్రం ప్రతిపాదించిన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. డీఎంకే ఆధ్వర్యంలో చెన్నైలో నిర్వహించిన అఖిల పక్ష సమావేశానికి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అభివృద్ధిలో ముందున్న రాష్ట్రాలకు రాజకీయపరమైన పరిమితులు విఘాతం కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు.నియోజకవర్గాల పునర్విభజన రాష్ట్రాల మధ్య రాజకీయ అసమానతకు దారితీస్తుందని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. పారదర్శకంగా లేని ఈ విధానంపై బీజేపీని నిలువరించాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. లోక్‌సభ సీట్లను పెంచకుండా రాష్ట్రాల్లో అంతర్గత నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని డిమాండ్ చేశారు.

మిగతా 2లో

## ప్రధాని మోదీకి వైయస్ జగన్ లేఖ



ప్రజాభూమిప్రతినిధి,తాడేపల్లి:-

నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై దక్షిణాది రాష్ట్రాల్లో ఆందోళన నెలకొన్న వేళ.. ప్రధాని నరేంద్ర మోదీకి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్‌రెడ్డిఓ లేఖ రాశారు. వచ్చే ఏడాది(2026) జరగబోయే డీలిమిటేషన్ ప్రక్రియలో ఆయా రాష్ట్రాల సీట్ల విషయంలో అన్యాయం జరగకుండా చూడాలని ప్రధానిని వైయస్ జగన్ కోరారు. ‘‘గత 15 ఏళ్లలో దక్షిణ రాష్ట్రాల్లో జనాభా బాగా తగ్గింది. కేంద్రం ఇచ్చిన జనాభా నియంత్రణ పిలుపే అందుకు కారణమని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

ఈ దశలో జనాభా ఆధారంగా డీలిమిటేషన్ ప్రక్రియ గనుక చేపడితే.. తమ రాష్ట్రాల్లో నియోజకవర్గాలు తగ్గుతాయనే చర్చ దక్షిణాది రాష్ట్రాల్లో నడుస్తోంది. ఇప్పుడున్న జనాభా లెక్కల ప్రకారం డీలిమినేషన్ చేస్తే దక్షిణాది రాష్ట్రాల భాగస్వామ్యం కచ్చితంగా తగ్గుతుంది. అందుకే జనాభా లెక్కల ప్రకారం ఈ డీలిమిటేషన్ లేకుండా చూడండి.. పార్లమెంటులో తీసుకునే విధాన నిర్ణయాలలో రాష్ట్రాలకు సమాన భాగస్వామ్యం కల్పించేలా ఉండాలి. అప్పుడే జాతీయ విధాన రూపకల్పనలో అన్ని రాష్ట్రాలకు సరైన భాగస్వామ్యం ఉంటుంది. అందుకే దక్షిణాన సీట్ల తగ్గింపు లేకుండా చూడాలి. ఈ కోణంలో ఆలోచించి డీలిమిటేషన్ చేపట్టాలని కోరుకుంటున్నా. అటు లోక్‌సభ ఇటు రాజ్యసభలో.. ఏ రాష్ట్రానికి ప్రాతినిధ్యం తగ్గకుండా ఉండే విధంగా రాబోయే నియోజకవర్గాల పునర్విభజన కసరత్తు నిర్వహించాలని కేంద్రాన్ని కోరుకుంటున్నా’’ అని ప్రధాని మోదీని వైయస్ జగన్ లేఖలో కోరారు.

**జనాభా వృద్ధి ఒకే తరహాలో లేదు**

‘రాజ్యాంగంలో 84వ రాజ్యాంగ సవరణ ప్రకారం 2026లో డీలిమిటేషన్ ప్రక్రియను చేపట్టాల్సి ఉంది కానీ దీనికి ముందుగా 2021లో చేపట్టాల్సిన జనాభా లెక్కింపు ప్రక్రియ కోవిడ్ కారణంగా వాయిదా పడింది. 2026 నాటికి జనాభా లెక్కల ప్రక్రియను పూర్తి చేయడానికి ఇప్పటికే అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. ఇది జరిగిన వెంటనే డీలిమిటేషన్ ప్రక్రియ జరుగుతుందన్న ఊహ అనేక రాష్ట్రాల్లో తీవ్ర చర్చకు దారి తీస్తోంది. ముఖ్యంగా ఈ ప్రక్రియ ద్వారా తమ ప్రాతినిధ్యం తగ్గిపోతుందని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి’అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. జనాభా నియంత్రణ కోసం వివిధ రాష్ట్రాలు అనేక విధానాలు అమలు చేశాయి.

అయితే వాటి ఫలితాలు ఆయా రాష్ట్రాల్లో వేర్వేరుగా ఉన్నాయి. దీని వల్ల జనాభా పెరుగుదల వివిధ రాష్ట్రాల్లో వివిధ రకాలుగా ఉంది. దేశవ్యాప్తంగా జనాభా వృద్ధి ఒకే తరహాలో లేదు. అసమతుల్యత ఉంది. దీని వల్ల డీమిలిటేషన్ అంశం విస్తృత స్థాయిలో ఆందోళనకు దారి తీస్తోంది అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ చెప్పుకొచ్చారు.42 మరియు 84వ రాజ్యాంగ సవరణల ద్వారా ఆయా రాష్ట్రాలకు సీట్ల కేటాయింపును నిలిపేశారు అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ చెప్పుకొచ్చారు. కాలక్రమేణా అన్ని రాష్ట్రాల్లో జనాభా నియంత్రణ కసరత్తులో భాగంగా ఒకేస్థాయిలో ఫలితాలు సాధిస్తాయని భావించి ఈ సీట్ల కేటాయింపును నిలిపేశారు. దేశ జనాభాలో ఆయా రాష్ట్రాల వాటా 1971 నాటి స్థాయికి చేరుకుంటుందని భావించారు అని వైఎస్ జగన్ గుర్తు చేశారు. కానీ 2011 జనాభా లెక్కల గణాకాంలను చూస్తే దశాబ్దాల తరబడి జనాభా వృద్ధి, దాని అంచనాలు అన్ని రాష్ట్రాల్లో ఒకేలా లేవని తేలింది. 1971 మరియు 2011 మధ్య 40 సంవత్సరాల్లో దేశ జనాభాలో దక్షిణాది రాష్ట్రాల వాటా తగ్గింది.

ఈ 15 సంవత్సరాల్లో మరింత తగ్గిందని మేం నమ్ముతున్నాం అని వైఎస్ జగన్ లేఖలో స్పష్టం చేశారు. జనాభా నియంత్రణను జాతీయ ప్రాధాన్యతగా తీసుకున్నందున దక్షిణాది రాష్ట్రాలు నిజాయితీగా తమ విధానాలను అమలు చేయడం వల్ల ఈ వాటా తగ్గింది.

మిగతా 2లో

ప్రజాభూమి

## పలాస కాశీబుగ్గలో ర్యాలీ

ప్రజాభూమి పలాస:

పలాస కాశీబుగ్గలు శనివారం బెట్టింగ్ లోన్ యాప్స్ పై వ్యతిరేక అవగాహన ర్యాలీ నిర్వహించారు డిఎస్పి వెంకట అప్పారావు ఏపీ టీ పిసి చైర్మన్ గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు గోపాల్ మాట్లాడుతూ బ్యాటింగ్ లోను యాప్స్ వల్ల యువత పక్కదారి పడుతున్నారని అప్పుల పాలవుతున్నారని ప్రస్తుతం ఈ యాప్ ఏ దింపులు వల్ల ఆత్మహత్య చేసుకున్నారని గుర్తు చేశారు.



# ప్రజలకు ఆర్థిక స్థిరత్వ కల్పన కూటమి ప్రభుత్వ లక్ష్యం

ప్రజాభూమి ప్రతినిధి, కర్నూలు:

'రాష్ట్ర అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. మా ప్రభుత్వంలో వ్యవస్థలను పటిష్ట పరుచుకుంటూ ముందుకు వెళ్తున్నామ'ని ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పంచాయతీ రాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తే.. కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో ప్రజలకు ఉపాధి కల్పించే దిశగా ఉపాధి హామీ పనులు ముందుకు తీసుకువెళ్తున్నామన్నారు. ప్రజలకు ఉపాధి, ఆర్థిక స్థిరత్వం కల్పించాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అనుభవజ్ఞులైన ముఖ్యమంత్రి ఉండబట్టే పల్లె పండుగ విజయవంతం అయ్యిందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి అంటే రైతన్న బలపడాలి. ఉపాధి హామీ పనులతో అన్నదాతల జీవితాల్లో కొత్త వెలుగులు రావాలి. అదే కూటమి ప్రభుత్వ ఆశయం అన్నారు. త్వరలో నియోజకవర్గానికి రెండు రోజులు పర్యటించి సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేస్తామన్నారు. కొణిదెల గ్రామ అభివృద్ధి కోసం సొంత ట్రస్ట్ నుంచి రూ. 50 లక్షలు ప్రకటించారు. శనివారం కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం, పుడిచెర్లలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ భూముల్లో సేద్యపు నీటి కుంటల(ఫామ్ పాండ్స్) నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షా 55 వేల ఫామ్ పాండ్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అధ్యక్ష్యతన నిర్వహించిన బహిరంగ సభను ఉద్దేశించి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "గత ప్రభుత్వంలో జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రాజకీయ ఉపాధి పథకంగా మార్చారు. అలాంటి వాటిని ఎదుర్కోవడానికి బలమైన అధికారులను ఏర్పాటు చేశాం. పల్లె పండుగ పనుల్లో కర్నూలు జిల్లా మొదటి స్థానంలో ఉంది. కర్నూలు జిల్లాలో రూ.75 కోట్లతో 117 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మించాం. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలో 98 శాతం రోడ్ల నిర్మాణం పూర్తయ్యింది. రైతులు నీరు నిలవ చేసుకోగలిగితే సమస్య ఉండదు. వర్షాలు రాగానే పంట కుంటలు నిండేలా ప్రణాళికలు చేస్తాం. గత ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలను పటిష్టపరచిన పాపాన పోలేదు. వాటిని పూర్తిగా నిర్వీర్యం చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ కింద సొంత గ్రామాల్లోనే పనులు కల్పించాం. ఉపాధి హామీ కింద ఇప్పటి వరకు రూ. 9,597 కోట్లు ఖర్చు చేశాం. ప్రజలకు ఉపాధి, ఆర్థిక స్థిరత్వం కల్పించాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యం.

గత ప్రభుత్వంలో లబ్దిదారులు ఎవరో కూడా తెలియకుండా చేశారుఈ రోజు జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఎకరం 30 సెంట్ల నేలలో 6 సెంట్లలో చెరువు, రెండు సెంట్లలో గట్టు ఉండే విధంగా నిర్మిస్తున్నాం. గత ప్రభుత్వంలో ఎవరు లబ్దిదారులో కూడా తెలియనంతగా అవకతవకలకు పాల్పడ్డారు. ఈ రోజు పుడిచర్ల గ్రామానికి చెందిన రైతు సూర రాజన్నకు చెందిన భూమిలో ఫామ్ పాండ్ కి భూమి పూజ చేశాం. ఈ పథకం ద్వారా ఉపాధి కూలీలు లబ్ది పొందుతున్నార. గ్రామాల్లో పనులు లేక నలిగిపోతున్నవారికి ఉపాధి కల్పించేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడు తుంది. ఈ పథకానికి కావాల్సిన అర్హత కష్టపడి పని చేయడమే.రాయలసీమను రతనాలసీమగా మార్చడమే కూటమి లక్ష్యంరాయలసీమలో నేల స్వభావాన్ని బట్టి ఇక్కడ నీటికి కటకట ఉంటుంది. వర్షం వచ్చినా నీటిని నిల్వ చేసుకునే పరిస్థితి లేదు. శ్రీ కృష్ణ దేవరాయలవారి హయాం మాదిరి రాయలసీమ రతనాలసీమ కావాలి. అదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. సీమకు పెద్ద పెద్ద ప్రాజెక్టులు వచ్చేలోపు రైతుల సౌలభ్యం కోసం ఫామ్ పాండ్స్ నిర్మిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా లక్షా 55 వేల పాండ్లు మే నెలాఖరు లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మొత్తం పాండ్లు పూర్తయితే ఒక టీఎంసీ నీటి నిల్వకు అవకాశం ఉంటుంది. రైతులంతా బాగుండాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పంట పొలాల్లో సేద్యపు నీటి కుంటల ఏర్పాటును ముందుకు తీసుకువెళ్తుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఒకే రోజు 13, 326 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించాం. చంద్రబాబు నాయుడు అనుభవాన్ని ప్రేరణగా తీసుకుని ఒకే రోజు గ్రామ సభలు నిర్వహించడంతో పాటు అభివృద్ధి పనుల జాబితా తీసుకోవడం ద్వారా ప్రపంచ రికార్డు సృష్టించాం. గ్రామ పంచాయతీల్లో గత ప్రభుత్వ హయాంలో జాతీయ దినోత్సవాల సమయంలో జెండా పండుగ చేయడానికి రూ. 100 నుంచి రూ. 250 వరకు ఖర్చు చేస్తే.. కూటమి ప్రభుత్వం ఆ ఖర్చుని రూ. 10 వేల నుంచి 25 వేలకు పెంచింది. పంచాయతీరాజ్ శాఖలో సమర్థ వంతమైన పాలన అందించేందుకు పునర్నియామకాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నరేగా నిధుల ద్వారా గ్రామాల్లో 97.44 మంది ఉపాధి కూలీలకు వారి గ్రామాల్లోనే ఉపాధి అందించాం. రూ. 6 వేల కోట్లు నేరుగా కూలీలకు అందించి ఉపాధితోపాటు ఆర్థిక స్థిరత్వం కల్పించే దిశగా అడుగు ముందుకు వేశాం. గత ప్రభుత్వంలో ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 4 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మిస్తే.. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 8 నెలల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల కిలోమీటర్లకు పైగా సీసీ రోడ్లు నిర్మించాం. వంద మందికి పైగా నివసిస్తున్న గిరిజన గ్రామాల్లో రహదారి సౌకర్యాలు కల్పించాం. డోలీ మోతలు లేని గిరిజన గ్రామాలు చూడాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో జన్మన్ పథకం కింద విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులకు నిధులు కేటాయించాం. ఎంపీడీవోల సమస్యలు మా దృష్టికి తెచ్చారు మీ సమస్య పరిష్కారం వెతుకుతాం. పంచాయతీ సెక్రటరీ అసోసియేషన్.. గ్రామ సచివాలయం, ఇంజినీరింగ్ అసోసి యేషన్ సమస్యలకు పరిష్కారం వెతుకుతాం. వాల్మీకి బోయ సంక్షేమ సంఘం నుంచి అర్జీ వచ్చింది. ఇది కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉంది. ముఖ్యమంత్రి తోనూ, కేబినెట్లోనూ మీ సమస్యపై మాట్లాడుతాను. రెడ్డి సంఘం నాయకులు కర్నూలు విమానాశ్రాయానికి స్వతంత్ర సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి గారి పేరు ప్రతిపాదించారు. దాన్ని ముందుకు తీసుకువెళ్తాం. నేను కులాలు మతాల గురించి మాట్లాడితే చాలా మందికి ఇబ్బందిగా ఉంటుంది. నేను ధర్మాన్ని మాత్రం బలంగా పాటిస్తాను. నా స్వధర్మాన్ని పాటిస్తాను. అన్ని ధర్మాలను గౌరవిస్తాను. గాజుల బలిజలు బీసీ డి లో చేర్చమని అడిగారు. మీకు న్యాయం జరిగేలా కృషి చేస్తాను. బుడగ జంగాలకి స్వతంత్ర్య అనంతరం కుల ధృవీకరణ కూడా లేకుండాపోయింది. వారికి న్యాయం చేస్తాం.• అన్ని గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందిపాణ్యం నియోజకవర్గానికి సంబంధించి స్థానిక శాసనసభ్యుల కోరిక మేరకు అభివృద్ధి పనులు ముందుకు తీసుకువెళ్తాం. పరిమితి మేరకు ప్రణాళికలు రూపొందించుకుని పూర్తి చేస్తాం. ఉపాధి హామీ బకాయిలు రెండు రోజుల్లో జమ అయ్యేలా చూస్తాం. అవసరం అయితే ఈ విషయంపై ముఖ్యమంత్రి గారితో మాట్లాడుతాం. కొణిదెల గ్రామాన్ని దత్తత తీసుకుంటానని గతంలో చెప్పాను. ఆ గ్రామ అవసరాలు తీర్చేందుకు సొంత ట్రస్ట్ నుంచి రూ.50 లక్షల నిధులు కేటాయించి సౌకర్యాలు కల్పిస్తాం. ప్రభుత్వం పథకాల ద్వారా చేయదగిన పనులు అధికారులతో మాట్లాడి పూర్తి చేస్తాం. కొణిదెల గ్రామంతో పాటు అన్ని గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తాం. ఒక్కో జిల్లాలో రెండు నుంచి మూడు రోజులు ఉండి ప్రజల సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తాం" అన్నారు. తలకు పాగా చుట్టి.. గడ్డ పార చేతబట్టిపంట పొలాల్లో సేద్యపు నీటి కుంటల (ఫామ్ పాండ్) ప్రారంభోత్సవానికి కర్నూలు జిల్లా, ఓర్వకల్లు మండలం, పుడిచర్లకు వచ్చిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వయంగా ఫామ్ పాండ్ తవ్వకానికి శ్రీకారం చుట్టారు. సొంత వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయం అలవాటు ఉన్న ఆయన తలకు పాగా చుట్టి రైతుగా మారిపోయారు.

గడ్డపార చేతబట్టి శంకుస్థాపనకు సిద్ధం చేసిన ప్రాంతంలో గణపతిని పూజించి కుంట తవ్వకాన్ని ప్రారంభించారు. గడ్డపారతో గుంత తవ్వి స్వయంగా మట్టిని పారతో ఎత్తి గంపలో వేశారు. ఉపాధి కూలీలతో కలసి పనిలో పాలు పంచుకోవడంతోపాటు వారందరినీ వేదిక మీదకు పిలిచి లబ్ధిదారులుగా పరిచయం చేశారు.ఈ కార్యక్రమంలో కర్నూలు పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ భైరెడ్డి శబరి, పాణ్యం శాసనసభ్యురాలు గౌరు చరితారెడ్డి, నందికొట్కూరు శాసన సభ్యులు గిత్తా జయసూర్య, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి కమిషనర్ కృష్ణ తేజ, జిల్లా కలెక్టర్ రంజిత్ భాషా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పన్నుల రూపంలో భారీగా చెల్లిస్తున్నప్పటికీ తక్కువ మొత్తంలో తిరిగి పొందుతున్నాం

మొదటిపేజీ తరువాయి

గతంలో 1976లో సీట్లను పెంచకుండానే నియోజకవర్గాల పునర్విభజన చేపట్టారని గుర్తు చేశారు.జనాభా ఆధారిత పునర్విభజన ప్రక్రియను దక్షిణాది రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాధాన్యం తగ్గుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాదిని ఉత్తరాది రాష్ట్రాలు ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణించే ప్రమాదం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజనను ఆమోదించవద్దని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఉత్తరాది రాష్ట్రాల ఆధిపత్యాన్ని అంగీకరించబోమని ఆయన తేల్చి చెప్పారు.తెలంగాణ వేగవంతమైన ఆర్థికాభివృద్ధిని సాధించిందని, జీఎస్డీపీ, తలసరి ఆదాయంలో వృద్ధిని నమోదు చేసిందని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో సుపరిపాలనతో పాటు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పన్నుల రూపంలో కేంద్రానికి భారీగా చెల్లింపులు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. రూపాయి చెల్లిస్తే తెలంగాణకు 42 పైసలు, తమిళనాడుకు 26 పైసలు, కర్ణాటకకు 16 పైసలు, కేరళకు 49 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆయన తెలిపారు. అదే బీహార్‌కు రూ.6.06, ఉత్తర ప్రదేశ్‌కు రూ.2.03, మధ్యప్రదేశ్‌కు రూ.1.73 మేర తిరిగి వస్తున్నాయని ఆయన వివరించారు.

# ఆ వార్తలు కేవలం ఊహాగానాలు.. లేఖ విడుదల చేసిన జనసేన

-డీలిమిటేషన్ మీటింగ్‌కు జనసేన తరపున ప్రజా ప్రతినిధులు హాజరైనట్లు ప్రచారం

-ఈ సమావేశంలో జనసేన నుంచి ఎవరు హాజరుకాలేదని పార్టీ స్పష్టీకరణ

-ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా లేఖ విడుదల

ప్రజాభూమిప్రతినిధి,అమరావతి:-

చెన్నైలో తమిళనాడు సీఎం స్టాలిన్ ఆధ్వర్యంలో జరిగిన డీలిమిటేషన్ మీటింగ్‌కు ఏపీ నుంచి జనసేన పార్టీ ప్రజా ప్రతినిధులు హాజరైనట్లు ప్రచారం జరుగుతోంది. కానీ, ఈ సమావేశంలో జనసేన తరపున ఎవరు హాజరుకాలేదు. ఇదే విషయమై జనసేన పార్టీ సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా ఒక లేఖను విడుదల చేసింది. తాము సీఎం స్టాలిన్ నిర్వహించిన డీలిమిటేషన్ మీటింగ్‌కు హాజరైనట్లు వస్తున్న వార్తలు కేవలం ఊహాగానాలు మాత్రమేనని ఈ లేఖ ద్వారా స్పష్టం చేసింది. ఈ అఖిల పక్ష సమావేశానికి హాజరు కావాల్సిందిగా ఆహ్వానం అందిందని, కానీ తాము హాజరు కాలేమని సమాచారం అందించినట్లు పేర్కొంది. వేర్వేరు కూటములుగా ఉన్నందున సమావేశంలో పాల్గొనడం కూదరదని మర్యాదపూర్వకంగా తెలియజేయాలని తమ అధినేత పవన్ కల్యాణ్ సూచన మేరకు వారికి సమాచారం ఇచ్చినట్లు జనసేన పేర్కొంది. ఇక డీలిమిటేషన్ పై వారికి ఒక అభిప్రాయం ఉన్నట్లే, తమకు ఓ విధానం ఉందని, ఈ విషయాన్ని సరైన వేదికపై వెల్లడిస్తామని లేఖలో పేర్కొనడం జరిగింది. ఇదిలా ఉంటే... కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రతిపాదించిన డీలిమిటేషన్ ను తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. 2026 జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాల పూనర్విభజనను అంగీకరించడం లేదు. ఇదే విషయ మై జాతీయ స్థాయిలో ఉద్యమించేందుకు స్టాలిన్ సిద్ధమవుతున్నారు. ఇందు కోసం దక్షిణాది రాష్ట్రాల ప్రజా ప్రతినిధుల మద్దతు కూడగడుతున్నారు. ఇందులో భాగంగానే చెన్నైలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ నుంచి సీఎం రేవంత్ రెడ్డి హాజరైన విషయం తెలిసిందే.

# ప్రధాని మోదీకి వైయస్ జగన్ లేఖ

మొదటిపేజీ తరువాయి

1971 జనాభా లెక్కల ప్రకారం దక్షిణాది రాష్ట్రాల జనాభా వృద్ధిరేటు 24.08 శాతం అయితే, 2011 జనాభా లెక్కల ప్రకారం దక్షిణాది రాష్ట్రాల జనాభా వృద్ధి రేటు 20.88 శాతం అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ చెప్పుకొచ్చారు.'రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న జనాభా లెక్కలను ఆధారంగా చేసుకుని డీలిమిటేషన్ ప్రక్రియ జరిగితే దేశ విధానాల రూపకల్పన సహా శాసన ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాల భాగస్వామ్యం గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ఇదే విషయాన్ని మీ దృష్టికి తీసుకు వస్తున్నాను'అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ తెలిపారు. 'దామాషా ప్రకారం అన్ని రాష్ట్రాలకు సీట్ల పెరుగుదల అంశాన్ని దృష్టిలో ఉంచుకుని డీలిమిటేషన్ కసరత్తు చేపడతామని హోం మంత్రి అమిత్‌షా హామీ ఇచ్చినందుకు కృతజ్ఞతలు. అయితే దీని కోసం రాజ్యాంగ పరంగా చేయాల్సిన సదలిం పును కూడా మీ దృష్టికి తీసుకు వస్తున్నాను. భార త రాజ్యాంగంలోని ఆర్టికల్ 81 (2) (ఎ) ప్రకారం జనాభా ప్రాతిపదికన ఆయా రాష్ట్రా లకు సీట్ల కేటాయింపు జరగాలని పేర్కొంది. దీని ప్రకారం డీమిలిటేషన్ ప్రక్రియలో ముందుకు వెళ్తే ఈ నిబంధన హోంమంత్రి అమిత్‌షా ఇచ్చిన హామీని అమలులో అడ్డం కులు ఏర్పడతాయి. అందువల్ల దామాషా ప్రకారం ప్రతి రాష్ట్రానికి సీట్ల కేటాయింపుపై రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవసరం ఉంది. దీని వల్ల సీట్లలో ఆయా రాష్ట్రాల వాటాలు అలానే ఉంటాయి, ఆయా రాష్ట్రాల ప్రాతినిథ్యం తగ్గుతుందనే అంశం ఉత్పన్నం కాదు'అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు.'డీలిమిటేషన్ ప్రక్రియ పై వస్తున్న అభ్యంతరాలు దేశ సామాజిక, రాజకీయ సామరస్యాన్ని దెబ్బ తీసే అవకాశం ఉన్నందున ఈ అంశం తీవ్రతను దృష్టిలో ఉంచుకోవాలి అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ లేఖలో కోరారు. ఈ విషయంలో ప్రధానిగా మీ నాయకత్వం, మార్గనిర్దేశం చాలా ముఖ్యం. మీరిచ్చే హామీ అనేక రాష్ట్రాలకున్న భయాలను, అపో హలను తొలగించడానికి దోహదపడుతుంది అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ వెల్లడించారు.





## శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా మెడికల్ షాపుల్లో తనిఖీలు

ప్రజాభూమి పలాస:

ఆపరేషన్ గరుడ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ షాపుల్లో శోధన నిర్వహిస్తున్న విషయం తెలిసిందే ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి విజిలెన్స్ అండ్ ఇన్ఫాస్ట్మెంట్ పోలీస్ డ్రగ్ కంట్రోల్ టీంలు మెడికల్ షాప్ ఏజెన్సీలపై అకస్మిక దాడులు నిర్వహించారు మెడికల్ షాపులలో మందులు సరఫరా మందులు నాణ్యత పై తనిఖీలు నిర్వహించారు మైనర్లకు నార్కోటెక్ ఎదుటివ్ మందులు అమ్మకాలపై ఆరా తీశారు జిల్లాలో మెడికల్ షాపుల్లో ఔషధ నియంత్రణ విజిలెన్స్ అధికారులు పలు అంశాలపై లోతుగా పరిశీలన చేస్తున్నారు కాలం చెందిన మందులు డాక్టర్ సలహా లేకుండా విక్రయిస్తున్న మందులు తదితర అంశాలపై పరిశీలన చేస్తున్నారు శనివారం కూడా జిల్లాలోని పలు మండలాల్లో తనిఖీలు కొనసాగుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను చెల్లిం<చిందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలకు సంబంధించి నిధులు విడుదల చేశామని ఆయన గుర్తుచేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మాత్రం 2019లో అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వ బకాయిలను చెల్లించలేదని, తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన అభివృద్ధి పనులను నిలిపి వేశారని లోకేశ్ ఆరోపించారు. సగం పూర్తయిన పనులను ధ్వంసం చేశారని విమర్శించారు.

# డీలిమిటేషన్‌తో సౌత్ రాష్ట్రాలకు అన్యాయం.. స్వదేశంలో రాజకీయ అధికారం కోల్పోతున్నాం

మొదటిపేజీ తరువాయి

ఈ సమావేశంలో 2026లో జరిగే డీమిలిటేషన్ ప్రక్రియలో పారదర్శకత కానీ స్పష్టత కానీ లేదని ఆందోళన వ్యక్తం చేస్తూ ఈ ఓ తీర్మానం ఆమోదించారు. మెరుగైన పనితీరు కనబరుస్తున్న రాష్ట్రాల రాజకీయ, ఆర్థిక భవిష్యత్తు కాపాడేందుకు చొరవ తీసుకున్నందుకు తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్‌ను జేఏసీ ప్రశంసించింది. డీలిమిటేషన్‌పై జేఏసీ తదుపరి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తమిళనాడు సీఎం స్టాలిన్ సారథ్యంలో డీలిమిటేషన్‌పై జరుగుతున్నఈ సమావేశానికి 5రాష్ట్రాలకు చెందిన 14మంది ప్రతినిధులు హాజరయ్యారు.

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, TPCC అధ్యక్షుడు మహేష్‌గౌడ్, బీఆర్ఎస్ నుంచి కేటీఆర్, వినోద్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. కేరళ సీఎం పినరయి విజయన్, పంజాబ్ సీఎం భగవంత్ సింగ్‌మాన్, అకాలీదళ్ ప్రతినిధులు, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పాల్గొంటున్నారు. జేఏసీ సమావేశానికి టీఎంసీని ఆహ్వానించినప్పటికీ ఆ పార్టీ ప్రతినిధులు హాజరుకాలేదు.



## శ్రీకాకుళంలో ఏర్పోర్ట్ అంటే నవ్వారు :మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాభూమి పలాస:

శ్రీకాకుళం జిల్లాలో ఎయిర్పోర్ట్ నిర్మాణంపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు శ్రీకాకుళంలో ఏర్పోర్ట్ అనగానే అందరూ నవ్వారు శ్రీకాకుళానికి రాదు అనుకున్న విమానాశ్రయం ప్రభుత్వ ఆలోచనలతో వచ్చింది ఎయిర్పోర్ట్ తోనే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయని జీడిపప్పును కూడా దేశ విదేశాలకు పంపవచ్చని అందరూ కృషి చేస్తే త్వరలోనే పలాసలో మీ కళ్ళ ముందు విమానం ల్యాండ్ అవుతుందని మంత్రి అన్నారు

## జ్ఞానపీఠ్ అవార్డు పురస్కారానికి ఎంపికైన హిందీ రచయిత వినోద్ కుమార్ శుక్లా



న్యూఢిల్లీ:ప్రఖ్యాత హిందీ రచయిత వినోద్ కుమార్ శుక్లా 2024 సంవత్సరానికి గాను జ్ఞానపీఠ్ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ విషయాన్ని జ్ఞానపీఠ్ కమిటీ శనివారం అధికారికంగా ప్రకటించింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి ఈ అత్యున్నత సాహిత్య పురస్కారాన్ని అందుకున్న తొలి రచయితగా వినోద్ కుమార్ శుక్లా నిలిచారు.భారతీయ సాహిత్యానికి ఆయన చేసిన విశేషమైన సేవలకు గుర్తింపుగా ఈ జ్ఞానపీఠ్ అవార్డును ప్రదానం చేయనున్నారు.

దేశంలోనే ఇది అత్యున్నతమైన సాహిత్య పురస్కారంగా పరిగణించబడుతుంది. ఈ అవార్డు కు ఎంపికైన 12వ హిందీ రచయితగా శుక్లా గుర్తింపు పొందారు. ఈ పురస్కారంలో భాగంగా రూ. 11 లక్షల నగదు బహు మ తితో పాటు, సరస్వతి కాంస్య విగ్రహాన్ని అందజేస్తారు.హిందీ సాహిత్యంలో ఆయన చేసిన కృషికి, ఆయన యొక్క విలక్షణమైన రచనా శైలికి గాను ఈ అవార్డు లభించింది. ఇదివరకే, 1999లో ఆయన సాహిత్య అకాడమీ అవార్డును కూడా అందుకున్నారు.

అక్టోబర్,


ప్రజాభూమి


# సహజ వ్యవసాయంతోనే ఆర్థిక, ఆరోగ్య భద్రతకు భరోసా

**అనంతలో ప్రారంభమైన మిల్లెట్ మేళాలో వక్తలు**

**మూడు రోజుల పాటు కొనసాగునున్న "మన వ్యవసాయం, పంటలు, వంటకాలు, ఆరోగ్యం" కార్యక్రమం**



**ప్రజాభూమి బ్యూరో, అనంతపురము**

పెరుగుతున్న ఆరోగ్య సమస్యలకు సహజ వ్యవసాయ పద్ధతుల ద్వారా స్థానిక రకాల పంటలను పండించడమే ఏకైక పరిష్కారమని, రాబోయే కాలంలో ఆహార, ఆదాయ భద్రతను కల్పించడమేనని శనివారం ఇక్కడ ప్రారంభించిన మూడు రోజుల కార్యక్రమం "మన వ్యవసాయం, పంటలు, వంటకాలు, ఆరోగ్యం" ప్రారంభోత్సవంలో వక్తలు అభిప్రాయపడ్డారు. అనంతపురంలోని పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో అనంతపురం మాజీ కలెక్టర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బి. జనార్ధన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం అనంతపురంలోని సుభాష్ పాలేకర్ సహజ సాగు సూత్రాలను అనుసరించి ఎకరానికి రూ.3 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ఆర్థిక భద్రత కల్పించాలని ప్రకృతి వ్యవసాయ స్వతంత్ర ప్రచారకర్త విజయ రామ్ పిలుపునిచ్చారు. సుభాష్ పాలేకర్ నేచురల్ ఫార్మింగ్ (ఎస్ పి ఎన్ ఎఫ్) సూత్రం భారతదేశంలోని 45 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూర్చిందని, పెట్టుబడి రహిత పద్ధతిలో సాగు చేయడానికి రైతులు స్వచ్ఛందంగా సహాయపడాలనే తన ఉద్దేశాన్ని ఆయన వివరించారు.

మాజీ ఐఏఎస్ అధికారి, ఎన్ఐఆర్డీ డైరెక్టర్ జనరల్ డబ్ల్యూ ఆర్. రెడ్డి, జమ్మూ కాశ్మీర్ మాజీ డిజిపి గోపాల్ రెడ్డి, ఏపీ ఎం ఏ ఎస్ సీఈవో ఎండి సిఎస్.రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, 18 ఎన్జీవోలకు చెందిన ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ సంస్థలు మరియు ఎన్జీవోలు ఏర్పాటు చేసిన 30 స్టాళ్లను సందర్శించారు. ఎ.ఎఫ్.ఎకాలజీ డైరెక్టర్ వై.వి. మల్లారెడ్డి ఈ మిల్లెట్స్ మేళా నేపథ్యాన్ని, సందర్భాన్ని క్లుప్తంగా వివరిస్తూ.. ఈ కార్యక్రమం ద్వారా రైతు సమస్యలకు, ప్రజలకు ఎదురయ్యే ఆరోగ్య సమస్యలన్నింటికీ సహజ వ్యవసాయమే దివ్యౌషధం అనే సందేశాన్ని అందించాలి. రెండవ రోజు "వాతావరణ మార్పు" నేపథ్యంలో సుస్థిర వ్యవసాయం తర్వాత మిల్లెట్‌లను పండించడం మరియు వినియోగించడం కోసం అంకితం చేయబడుతుంది. వ్యవస్థ అంతర్ సాంస్కృతిక కార్యకలాపాలను నిరుత్సాహపరిచినందున కూలి కార్మికులపై ఆధారపడటం కూడా కనీస స్థాయికి తగ్గించబడుతుంది. ఈ వ్యవస్థ వెనుక ఉన్న మొత్తం తత్వశాస్త్రం రైతును స్వావలంబనగా మార్చడం, తద్వారా అతను డబ్బు ఇచ్చేవారి బారి నుండి మరియు మార్కెట్‌పై ఆధారపడిన అధిక-ఖర్చు ఇన్‌పుట్‌ల నుండి విముక్తి పొందడం అని విజయ రామ్ అభిప్రాయపడ్డారు. స్థానిక నేలలకు అనుకూలమైన వాటిని పండించడమే కాకుండా పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు స్థానికంగా పండించిన వాటిని తినాలని జనార్ధన రెడ్డి అన్నారు. "ఒకప్పుడు ఆహార ధాన్యాల కొరత ఉండేది, కానీ నేడు సమృద్ధిగా ఉంది, ఇది బాల్యం నుండి అన్ని వయసులలో పెరిగిన ఊబకాయం స్థాయిలలో ప్రతిబింబిస్తుంది. ఎ.ఎఫ్. ఎకాలజీ సెంటర్ నిర్వాహకులు రాయలసీమ, అనంతపురం జిల్లాలో ప్రత్యేకంగా కనిపించే పక్షులపై ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఇది రైతులకు అనేక విధాలుగా సహాయపడుతుంది. పక్షి ఛాయాచిత్రాల సేకరణకు సంరక్షకుడు కాయల అశోక్ కుమార్, ఇతర ఫోటోగ్రాఫర్‌లు సహకరించారు. అల్పాహారం, భోజనం అందించే నాలుగు ఫుడ్ స్టాల్స్ ఉన్నాయి. వారి మెనూలో మిల్లెట్ ఆధారిత ఆహార పదార్థాలు మాత్రమే ఉన్నాయి. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు జిల్లా నలుమూలల నుంచి సుమారు 800 మంది రైతులు పాల్గొన్నారు.

# శాప్ చైర్మన్ రవినాయుడిని సత్కరించిన నేతలు..!

**ప్రజా భూమి, చంద్రగిరి:**



ఈనెల 18,19,20వ తేదీల్లో విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులక్రీడా సాంస్కృతిక కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడంత ోపాటు సీఎంనారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం కొణెదల పవన్ కల్యాణ్, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడిచే మన్ననలు పొందిన శాప్ చైర్మన్ రవినాయుడుని తిరుపతిలో స్థానిక ఎమ్మెల్యే అరణిశ్రీనివాసులుఆధ్వర్యంలోసత్కరించారుఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసులు మాట్లాడుతూ క్రీడల నిర్వహణలో రవినాయుడు చూపిన శ్రద్ధ, కృషిని ప్రశంసించారు. కూటమి అధిష్టానం తనకు అప్పగించిన బాధ్యతలను దిగ్విజయంగా పూర్తిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు రాజారెడ్డి, నైనార్ మహేష్ యాదవ్, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి లో రెండు రోజుల వర్క్షాప్ ముగింపు

**ప్రజా భూమి గండేపల్లి.**



గండేపల్లి మండలం సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ %డ% సైబర్ సెక్యూరిటీ విభాగాలు మరియు టీచర్ ఇన్నోవేషన్స్ వారి సంయుక్త ఆధ్వర్యంలో పవర్ %దీ×% మాస్టర్ క్లాస్,బిల్డింగ్ ఇంటరాక్టివ్ డాష్బోర్డ్స్ మరియు రిపోర్ట్స్ అను అంశము పై విద్యార్థినీ విద్యార్థులకు రెండు రోజుల పాటు వర్క్ షాప్ నిర్వహించామని కళాశాల చైర్మన్ డా పరుచూరి కృష్ణారావు తెలియచేసారు.ఈ సందర్భముగా కళాశాల ప్రిన్సిపాల్ డా జి నరేష్ మాట్లాడుతూ,విద్యార్థినీ, విద్యార్థులు అందరూ నిరంతరం తమను తాము మెరుగు పరచుకుంటూ భవిష్యత్తు లో మెరుగైన ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవడం కోసం వర్క్షాప్ అనంతరం కూడా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సైబర్ సెక్యూరిటీ విభాగాధిపతులు జిసత్యమోహన చౌదరి, టి గంగా భవాని, కళాశాల డైరెక్టర్ మానేజ్మెంట్ ఎం వి హరనాధబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం సతీష్,డైరక్టర్-అకడమిక్స్ కెసత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆదిత్య లో విజయవంతంగా ముగిసిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్

**ప్రజా భూమి గండేపల్లి**



గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రెండో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ మెటీరియల్స్ మరియు ఎనర్జీ సైన్స్ (ఐసిఎంఈఎస్- 2025 ) విజయవంతంగా ముగిసింది అని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో -ఛాన్సలర్ డాక్టర్ ఎం శ్రీనివాస రెడ్డి తెలియజేశారు. ఈ కాన్ఫరెన్స్ లో ఆన్ లైన్ కీ నోట్ స్పీకర్ గా డాక్టర్ దినేష్ బాలసుబ్రమణ్యన్, తైవాన్ దేశం, డాక్టర్ మోహద్ జహీర్ ఖాన్ యుసుఫ్జాయ్,ఐఐటి బిహెచ్ యు మరియు డాక్టర్ సుమన్ చక్రబోర్తి ,ఐఐటి ఖరాగపూర్ నుంచి పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్ ఆఫ్ లైన్ కీ నోట్ స్పీకర్ గా డాక్టర్ వై రవికుమార్,ఎన్ఐటి వరంగల్ నుంచి పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్ లో విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు వారి యొక్క రీసెర్చ్ పేపర్స్ ని ఇతర దేశాల (రష్యా , స్పెయిన్ మరియు నైజీరియా) యూనివర్సిటీ నుండి మరియు ఇండియా లో వేరువేరు కాలేజీ ల నుండి హైబ్రిడ్ మోడ్ లో ప్రెసెంట్ చేసారు. కీ నోట్ స్పీకర్ పేపర్స్ ని మరియు ప్రెసెంటేషన్ ఆధారంగా మార్క్స్ ను ఇచ్చారు. ఎక్కువ మార్కులు వచ్చిన పేపర్ కి బెస్ట్ పేపర్ అవార్డ్ గా ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో -ఛాన్సలర్ డాక్టర్ ఎం శ్రీనివాస రెడ్డి ప్రకటించారు.

# వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర ఏ 2047 లక్ష్య సాధన దిశగా ముందడుగు వేద్దాం

**- లక్ష్యాల సాధనలో అధికారులే రథ సారథులు**
**- వికసిత్ ఎన్టీఆర్ జిల్లా సాకారానికి సమష్టిగా కృషిచేద్దాం**
**- ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్**




**ప్రజాభూమి ప్రతినిధి, విజయవాడ:**

వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర ఏ 2047 లక్ష్య సాధన దిశగా ముందడుగు వేద్దామని.. లక్ష్యాల సాధనలో అధికారులే రథ సారథులని ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ అన్నారు.శనివారం లంకా దినకర్ అధ్యక్షతన కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తదితరులు హాజరయ్యారు.

గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పమైన వికసిత్ భారత్ - 2047, గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతకు రూపమైన స్వర్ణాంధ్ర ఏ 2047 లక్ష్యాల సాధనకు తద్వారా వికసిత్ ఎన్టీఆర్ జిల్లా సాకారానికి అవసరమైన కార్యాచరణ, సవాళ్లను అధిగమించేందుకు అనుసరించాల్సిన ప్రణాళికపై సమావేశంలో చర్చ జరిగింది. ఉపాధిహామీపథకం మెటీరియల్ కాంపోనెంట్ వినియోగం, 2019-24 మధ్య అవకతవకలు, ప్రతి గ్రామంలో ప్రతి గృహానికి సురక్షిత తాగునీరు అందించే సంకల్పంతో అమలవుతున్న జల్ జీవన్ మిషన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం ఇచ్చిన నిధుల పనుల్లో మందగమనం, విజయవాడ బైపాస్ పనుల పురోగతి, అమృత్ పథకం నిధుల వినియోగంతో సాధించిన ఫలితాలు, అమృత్ 2.0 లక్ష్యాలు, గ్రామీణసడక్ యోజన, లఖ్‌పతి దీదీ, గరీబ్ కళ్యాణ్ అన్నయోజన, పీఎంసూర్యఘర్, కుసుమ్, పీఎం ఆవాస్ యోజన, టిడ్కో గృహాలు, పీఎం విశ్వకర్మ యోజన వంటి కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు తీరుపై సమావేశంలో చర్చించారు.

అనంతరం లంకా దినకర్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో పులిచింతల, ప్రకాశం బ్యారేజీ దీర్ఘకాలిక వనరుల ద్వారా జిల్లాలోని అన్ని మండలాలకు సురక్షిత తాగునీరు ఇచ్చే లక్ష్యానికి అవసరమైన ఓవర్ హెడ్ ట్యాంకులు, ఫిల్టర్లు, పైప్ లైన్లతో సవరించిన డీపీఆర్‌తో జల్ జీవన్ మిషన్ అమలు చేయడానికి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గత అయిదేళ్లలోని అస్తవ్యస్త విధానాలతో కాకుండా వనరుల సద్వినియోగమయ్యేలా స్పష్టమైన ప్రణాళిక తయారు చేయాలని అధికారులకు సూచన ఇవ్వడం జరిగిందన్నారు. విజయవాడ అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి సంబంధించి కేంద్రప్రభుత్వం 2016లో రూ. 460 కోట్లు విడుదల చేసినా ఇప్పటివరకు పూర్తికాకపోవడానికి కారణం 2019 - 24 మధ్య రాష్ట్ర ప్రభుత్వం, కార్పొరేషన్ మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయకపోవడం ముఖ్యంగా కార్పొరేషన్ నిధులు డైవర్షన్ చేసినందున అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తికాలేదన్నారు. తొమ్మిదేళ్ల కిందట వేసిన అంచనాలతో ఇప్పుడు పని పూర్తికాదు కాబట్టి సవరించిన అంచనాలతో డీపీఆర్ తయారు చేసి, నిధుల సమీకరణపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి యుద్ధప్రాతిపదికన పనులు మొదలుపెట్టాలని అధికారులకు ఆదేశాలివ్వడం జరిగిందన్నారు. ఒక రోజుకు ఉపాధిహామీ వేతనం రూ. 300 అయితే జిల్లాలో సగటున రూ. 260.27 ఉందని.. మొత్తం ఉపాధి కూలీలలో 45% పైగా ఎస్సీ, ఎస్టీలు ఉన్నారని, మొత్తం వేతనదారుల్లో 50 % పైగా మహిళలు ఉన్నారనిగణాంకాలు తెలుపుతున్నాయని.. వేతనదారులకు రూ. 300 వచ్చేలా అధికారులు కృషిచేయాలన్నారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాలకు చెందిన 49,358 మంది మహిళలను లఖ్‌పతి దీదీలుగా తీర్చిదిద్దాలని లక్ష్యాన్ని నిర్దేశించుకుంటే అంతకుమించి 50,470 మందిని గుర్తించడం జరిగిందన్నారు. డ్రోన్లను పైలట్ ప్రాజెక్ట్ కింద స్వయం సహాయక గ్రూపులకు అందించి, శిక్షణ ఇవ్వడం ద్వారా చిన్న, సన్నకారుల రైతులకు లబ్ధి చేకూరుతుందని, కేంద్ర ప్రభుత్వం డ్రోన్లపై సబ్సిడీ ఇస్తోందన్నారు.

భవానీ ద్వీపంలో వసతులకు రూ. 18 కోట్లు ఖర్చు చేసేలా ప్రణాళికలు రూపొందాయని.. ప్రకాశం బ్యారేజ్, పవిత్ర సంగమంలను పర్యాటకులను ఆకట్టుకునే విధంగా కార్యక్రమాల నిర్వహణపైనా చర్చ జరిగినట్లు తెలిపారు. కొండపల్లి కోటను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడానికి, కొండపల్లి బొమ్మలకు అవసరమైన ముడి సరుకుపై ప్రత్యేక దృష్టిపెట్టాలని అధికారులకు సూచించడం జరిగిందన్నారు. జిల్లాలోని ప్రముఖ దేవాలయాలతో ఆధ్యాత్మిక సర్క్యూట్ ఏర్పాటుపైనా సమావేశంలో చర్చించినట్లు తెలిపారు.

## కలసికట్టుగా జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం: ఎంపీ కేశినేని శివనాథ్

కలసికట్టుగా సమష్టి కృషితో ఎన్టీఆర్ జిల్లాను అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా నిలుపుదామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరముందన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జల్ జీవన్ మిషన్ వంటి పథకాలు జిల్లాలో మంచి ఫలితాలతో అమలయ్యేలా కృషిచేయాల్సిన అవసరముందన్నారు. గౌరవ ప్రధాని నేతృత్వంలో వికసిత్ భారత్, గౌరవ ముఖ్యమంత్రి నేతృత్వంలో స్వర్ణాంధ్ర ఏ 2047 లక్ష్యాల సాధనకు, 20 సూత్రాల అమలుకు కృషిచేయడం జరుగుతుందన్నారు. కేంద్రం నుంచి నిధులు, వనరుల సమీకరణ పరంగా కృషిచేయనున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు.

## స్వర్ణాంధ్ర పది సూత్రాలకు అనుగుణంగా అడుగులు: కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

స్వర్ణాంధ్ర ఏ 2047 దార్శనిక పత్రంలోని పది సూత్రాలను.. 20 సూత్రాల అమలు కార్యక్రమానికి అనుసంధానిస్తూ లక్ష్యాల సాధనకు జిల్లాస్థాయిలో టీమ్ ఎన్టీఆర్ కృషిచేస్తున్నట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తూ

పేదరికం లేని సమాజం మొదలు ఉద్యోగ, ఉపాధి కల్పన, నైపుణ్యం-మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత, ఫార్మర్ అగ్రిటెక్, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, ఇంధన వనరుల సమర్థ వినియోగం, నాణ్యమైన ఉత్పత్తులు, స్వచ్ఛాంధ్ర, డీప్ టెక్ లక్ష్యాలతో పాటు 20 సూత్రాల అమలుకూ జిల్లా అధికార యంత్రాంగం కృషిచేస్తున్నట్లు తెలిపారు. వచ్చే అయిదేళ్లపాటు 15 శాతం సుస్థిర వార్షిక వృద్ధిరేటు లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రణాళికలు అమలుచేస్తున్నట్లు వివరించారు. 20 సూత్రాల అమలు కార్యక్రమానికి సంబంధించిన సమీక్షా సమావేశంలో చర్చించి తీసుకున్న నిర్ణయాలు అన్ని శాఖల పురోగతిని మదించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు దోహదం కలెక్టర్ లక్ష్మీశ అన్నారు.సమావేశంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్స్ %డ% అదర్ కన్స్ ట్రక్షన్స్ వర్కర్స్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, సీపీవో వై.శ్రీలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.'

# పట్టు పరిశ్రమ శాఖలో సిరులు కురిపిస్తున్న పదోన్నతులు...!!

**-పదోన్నతికి ఒక ధర పోస్టింగ్ కు మరో ధర**

**ప్రజాభూమి, హిందూపురం టౌన్**

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా రైతు సేవా కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న గ్రామ పట్టు పరిశ్రమ సహాయకుల పదో న్నతులలో పట్టు పరిశ్రమ శాఖలో సిరులు కురిపిస్తున్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఏకంగా రూ. ఒక కోటి వరకు మామూళ్లు చేరినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పదోన్నతులకు, పోస్టింగ్ లకు వేరువేరుగా ధరలు నిర్ణయించి మరీ కొందరు వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ లు ప్రత్యేక అధికారులతో విచారణ చేపడితే అన్ని విషయాలు బయట పడే అవకాశాలు ఉన్నాయి. గత ప్రభుత్వం గ్రామస్థాయిలో వ్యవసాయంతో పాటు పట్టు పరిశ్రమలో సైతం రైతులకు సహాయ సహకారాలు అందించి వ్యవసాయం, పట్టు పరిశ్రమను అభివృద్ధి చేయాలని రైతు భరోసా కేంద్రాలను గ్రామస్థాయిలో ఏర్పాటు చేయడం జరిగింది. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్చడం జరిగింది. అయితే ఇందులో విధులు నిర్వహిస్తున్న గ్రామ పట్టు పరిశ్రమ సహాయకులు (విలేజ్ సిరికల్చర్ అసిస్టెంట్) లను సాంకేతిక సహాయకులుగా (టెక్నికల్ అసిస్టెం టీ) పదోన్నతులు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 140 మందికి పదోన్నతులు కల్పించే విధంగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందులో ఒక్క ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే సుమారు 66 మందికి పదోన్నతులు కల్పించాలని జిల్లా పరిశ్రమ అధికారులు దస్త్రం సిద్ధం చేసి జిల్లా కలెక్టర్ కు నివేదికను అందించారు. ఇక్కడి వరకు అంతా బాగానే ఉన్నా వి ఎస్ ఏ నుంచి టెక్నికల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలంటే గతంలో నిర్వహించిన పరీక్షల్లో వచ్చిన మార్కుల మెరిట్ ఆధారంగా రోస్టర్ పాయింట్లను అనుసరించి పదోన్నతులు కల్పించాలి. అయితే ఈ నిబంధనలను గాలికి వదలి రాప్తాడు మండలంలో విధులు నిర్వహిస్తున్న ఒక వి ఎస్ ఏ ప్రధాన పాత్ర పోషించి పదోన్నతికి కోసం ఒక్కో ఉద్యోగి నుంచి రూ. 40 వేలు వసూలు చేశారని, వారికి కోరుకున్న చోటే పోస్టింగ్ ఇవ్వడానికి కోసం రూ. 2 లక్షలు వసూలు చేసినట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా అధికారులు సైతం అతని మధ్య వర్తిత్వంతోనే పదోన్నతులు, పోస్టింగులు ఇస్తున్నట్లు సంబంధిత శాఖలోని కొందరు ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు.

**కోర్టులో ఉన్నా పదోన్నతులా..**

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా పట్టు పరిశ్రమ శాఖలో సాంకేతిక సహయకులుగా కల్పించిన పదోన్నతులలో తమకు అన్యాయం జరిగిందని శ్రీరాములు నాయక్, బి. రాధ కృష్ణ, జి. ప్రసాద్ లు గత సంవత్సరం హైకోర్టును ఆశ్రయించారు. అయితే అనంతపురం, పుట్టపర్తి జిల్లాల పట్టు పరిశ్రమ శాఖ అధికారులు ఈ నెల 19న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న 69 మంది విఎస్ఎలకు పదోన్నతులు కల్పిస్తూ దస్త్రం సిద్ధం చేసి జిల్లా కలెక్టర్ కు పంపినట్లు తెలుస్తోంది. ఈ విషయం కోర్టులో ఉన్నప్పటికి వాటిని ఏ మాత్రం పట్టించుకోకుండా పదోన్నతులు ఎలా కల్పిస్తారో అర్థం కావడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.




పారదర్శకతతో పదోన్నతుల జాబితా సిద్ధం చేశాం - పద్మమ్మ, జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారిణి, పుట్టపర్తి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామ పట్టు పరిశ్రమ సహాయకుల పదోన్నతులు పూర్తి పారదర్శకంగా కల్పిస్తూ జాబితాను సిద్ధం చేశాం. ఇందులో ఎటువంటి ఒత్తిళ్లు, అవకతవకలు జరగలేదు. మెరిట్, రోస్టర్ పాయింట్లు తీసుకుని, జాబితాను ఒకటికి రెండుసార్లు పరిశీలించి పదోన్నతుల జాబితాను కలెక్టర్ కు పంపాం. డబ్బుల విషయం తమకు తెలియదని, రోస్టర్ పాయింట్లలో తమకు అన్యాయం జరిగిందని పలువురు కోర్టుకు వెళ్లిన విషయం సైతం మాకు తెలియదన్నారు.

# రోడ్డు ప్రమాదంలో నేషనల్ హైవే వ్యాన్ డ్రైవర్ మృతి.

**హైవే అధికారులు నిర్లక్ష్యం వల్లే డ్రైవర్ మృతి చెందాడని జాతీయ రహదారి నిర్బంధన .**

**ప్రజా భూమి గండేపల్లి**



గండేపల్లి మండలం మురారి గ్రామంలో నేషనల్ హైవే పై డ్రైవర్ విధులు నిర్వహిస్తున్న సమయంలో వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి మండల కేంద్రమైన గండేపల్లి గ్రామానికి చెందిన దోనాదుల కృష్ణారెడ్డి (52) సంవత్సరాలు.గత ఏడు నెలలుగా నేషనల్ హైవే అథారిటీ మెయింటినెన్స్ వ్యాన్ మీద పనిచేస్తున్నాడని, ఈ సందర్భంలో శనివారం ఉదయం గండేపల్లి మండలం మురారి గ్రామ మలుపులో జాతీయ రహదారిపై వ్యాను నిలుపుదల చేసి, వెనుక ఉన్న హెచ్చరిక స్తంభాలను నిలబెట్టే క్రమంలో వైజాగ్ వైపు నుండి రాజమండ్రి వైపు వెళ్లే లారీ బలంగా ఢీకొనడంతో వ్యాన్ కు లారీకి మధ్య ఇరుక్కుపోయి కృష్ణారెడ్డి అక్కడకక్కడే మృతి చెందాడు. హైవే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ ప్రమాదం జరిగిందంటున్నారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ స్థానికులు మృతదేహం వద్ద ఆందోళన చేపట్టారు. విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సరైన సేఫ్టీ ఇవ్వలేకపోవడం, మరొకపక్క వారికి సంబంధించిన ఇన్సూరెన్స్ లు కట్టకపోవడం, దానిపై అధికారులు చెప్పే సమాధానాలు పొంతన లేకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సరైన సమాధానాలు ఇవ్వాలంటూ కుటుంబ సభ్యులు మరియు గ్రామస్తులు మృతదేహంతో రోడ్డుపై ఆందోళన చేపట్టారు. దీంతో నేషనల్ హైవే అధికారులు తగు న్యాయం చేస్తామంటూ చెప్పడంతో ఆందోళన సద్దుమణిగింది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ శివనాగబాబు సిబ్బందితో వెళ్లి ఆందోళన చేసేవారికి హైవే సిబ్బందితో మాట్లాడించి రహదారిపై నిలుపుదల చేసిన వాహనాలను క్రమబద్ధీకరించారు. అనంతరం మృతదేహాన్ని పెద్దాపురం పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ జాతీయ రహదారిపై నిత్యం ఏదో ప్రమాదం జరగడానికి నేషనల్ హైవే సిబ్బంది కారణమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఒకచోట పని చేస్తున్నప్పుడు కిలోమీటర్ల మేరకు రోడ్డు ఒకపక్క నిలుపుదల చేసి హెచ్చరిక స్తంభాలను పెట్టడం వల్ల అనేకమంది ప్రమాదాలు గురై మృత్యువాత పడుతున్నారని,మరి కొంతమంది అంగవైకల్యానికి గురవుతున్నారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు వీటిపై తగు చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఆకులు కాలాక చేతులు పట్టుకున్న సందర్భంగా ఎవరైనా చనిపోయినప్పుడు మాత్రం అధికారులు వచ్చి తూతూ మంత్రంగా హామీలు ఇచ్చి యధావిధిగా కొనసాగుతున్నారని, ఇదే కొనసాగితే త్వరలో వారికి మరింత గుణపాఠం చెప్పే విధంగా జాతీయ రహదారి వెంబడి ఉన్న గ్రామస్తులు చర్యలు తీసుకుంటామన్నారు.



## వల్లంపట్లలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీల

ప్రజాభూమి, జీలుగుమిల్లి



వల్లంపట్ల గ్రామంలో విద్యుత్ సమస్య పట్ల సంబంధించి అధికారుల నుండి అడిగి తెలుసుకున్నారు. వెంటనే స్థానిక ఉన్న స్థలాన్ని పరిశీలన చేశారు. సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం వేగవంతమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించి విద్యుత్ ఎస్సీకి ఆదేశాలు జారీ చేశారు. టి. నరసాపురం మండలం బొర్రంపాలెం గ్రామంలో వాటర్ ట్యాంక్ లీకేజీ గురించి, బురదా నీరు సమస్య గురించి గ్రామస్తులు పోలవరం ఎంఎల్ఏ చిర్రి బాలరాజు గారికి తెలియపరచగా, వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి గడ్డమణుగు రవి , జనసేన మండల్ ప్రెసిడెంట్ అడపా నాగరాజు , టిడిపి ప్రెసిడెంట్ రామకృష్ణ గౌడ్ , ఎన్ డి ఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చింతలపూడి మీదుగా హైదరాబాద్ సర్వీస్ ప్రారంభం

ప్రజా భూమి, కామవరపుకోట




జంగారెడ్డిగూడెం నుండి విజయవాడ వయా చింతలపూడి మీదుగా ఏర్పాటు చేసిన నూతన బస్ సర్వీస్ ను జంగారెడ్డిగూడెం బస్టాండ్ లో ప్రారంభించిన ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్. మరియు ఆయనతో పాటు పట్టణ మరియు మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, మాహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు, జంగారెడ్డిగూడెం నుంచి విజయవాడ వయ చింతలపూడి మీదుగా బస్ సర్వీస్ ప్రారంభించడం మాకు చాలా సంతోషం గా ఉన్నదని మా ( ప్రయాణికుల ఇబ్బందులు ) కోసం ఈ సర్వీస్ చాలా ఉపయోగ కరం గా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కామవరపుకోట, జంగారెడ్డిగూడెం పార్టీ నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

## అమ్మవారి అనుగ్రహం అందరి పైన ఉండాలి

### శాసనసభ్యులు బాలరాజు

ప్రజాభూమి, జీలుగుమిల్లి



అమ్మవారి అనుగ్రహం అందరి పైనే ఉండాలని వేడుకున్నానని పోలవరం శాసనసభ్యులు బాలరాజు అన్నారు. మద్యనపు వారిగూడెం గ్రామంలో కొలువైయున్న శ్రీ శ్రీ శ్రీ ముత్యాల అమ్మవారిని సందర్శించి, అమ్మవారి దీవెనలు పొందారు. అనంతరం తిరుమల దేవి పేట లో శ్రీరామాలయం లో సీతా లక్ష్మణ, ఆంజనేయ సమేత స్వామి వారిని దర్శించి , మండల ప్రజలందరినీ చల్లగా చూడాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి గడ్డమణుగు రవి , జనసేన మండల్ ప్రెసిడెంట్ అడపా నాగరాజు, టిడిపి ప్రెసిడెంట్ రామకృష్ణ గౌడ్, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుటీర పరిశ్రమల ద్వారా గిరిజనుల ఆర్థిక అభివృద్ధి సాధ్యం.
## రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు

ప్రజాభూమి,బుట్టాయగూడెం.



చిన్న తరహా, కుటీర పరిశ్రమలు ద్వారా గిరిజనుల ఆర్థిక అభివృద్ధి, జీవన నాణ్యత సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. పోలవరం మండలం రెడ్డి కుంకాల లో శనివారం గిరిజన వికాస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 31 మంది గిరిజన రైతులకు తేనె పెట్టెలు, పరికరములు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆదికాభివృద్ధికి తోడ్పడే ఇలాంటి చక్కని అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని కోరారు. సంస్థ డైరెక్టర్ మూర్తి మాట్లాడుతూ ఈ సంస్థ ద్వారా గిరిజనులకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, అందులో భాగంగానే ఈ మారుమూల ప్రాంతాన్ని ఎంపిక చేసుకొని గిరిజనులను ఆర్థికంగా అభివృద్ధి చేయాలని ఉద్దేశంతో లబ్ధిదారులకు గత నెలలో తేనె ఉత్పత్తిపై శిక్షణ ఇచ్చి వారికి తేనె పెట్టెలు, పరికరములు ఇవ్వడం జరిగిందని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ సంస్థ ద్వారా గిరిజనులను అభివృద్ధి చేయటానికి గిరిజనుల సహకరిస్తే తమ వంతుగా ఎల్లవేళలా కృషి చేయడానికి మేము సిద్ధంగా ఉన్నామని తెలిపారు ఈ కార్యక్రమానికి ఐటీడీఏ హార్టికల్చర్ ఆఫీసర్ శ్రీనివాస్, ఏపీ ఎస్టి సెల్ కార్యదర్శి సున్నం నాగేశ్వరరావు పోలవరం జడ్పిటిసి హేమ కుమారి, ఏపీ స్టేట్ టిడిపి ఎస్టి సెల్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ కుర్సం దుర్గారావు, సర్పంచ్ గంగాదేవి జనసేన నాయకులు కోటం లక్ష్మణరావు కరకం పోతురాజు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి దంపతుల వివాహ రజితోత్స వేడుకలు

### హాజరై శుభాకాంక్షలు తెలియజేసిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూటమి నాయకులు

ప్రజా భూమి జగ్గంపేట

కాకినాడ జిల్లా జగ్గంపేట, గండేపల్లి మార్చి 22: స్థానిక పరిణయ ఫంక్షన్ హాల్ లో కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి దంపతుల 25వ పెళ్లిరోజు సందర్భంగా జ్యోతుల నవీన్ తనయుడు అనీష్ నెహ్రూ అంగరంగ వైభవంగా నవీన్ లక్ష్మీదేవి దంపతుల వివాహ రజతోత్స వేడుకలు నిర్వహించారు. ముందుగా జగ్గంపేట నవీన్ ఇంటివద్ద అన్నవరం సత్యనారాయణ స్వామి వారి వ్రతం నోచుకుని పరిణయ ఫంక్షన్ హాల్ కు చేరుకున్నారు. నవీన్ తల్లిదండ్రులు జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ మణి దంపతులు నవీన్ లక్ష్మీదేవి లకు దండలు మార్పించి కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేసి ఆశీస్సులు అందించారు. జ్యోతుల నవీన్ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసేందుకు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఎమ్మెల్సీ పే రాబత్తుల రాజశేఖర్, అనంత ఉదయ భాస్కర్, కూడా చైర్మన్ తుమ్మల బాబు, మాజీ ఎంపీ గిరిజాల వెంకటస్వామి నాయుడు, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, ఎస్ వి ఎస్ ఎన్ వర్మ, పర్వత బాపనమ్మ, గన్ని కృష్ణ ,రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు శ్రీరామ్ సత్యనారాయణ, నిమ్మకాయల రంగనాథ్, జక్కంపూడి గణేష్, వరుపుల తమ్మయ్య బాబు, తుమ్మలపల్లి రమేష్, నాలుగు మండలాల అధికారులు, కుటమి నాయకులు, వేలాదిగా కార్యకర్తలు పాల్గొన్నారు.





## ప్రశాంతమైన ఏజెన్సీలో మర్డర్లు జరుగుతాయి అని ఊహించలేదు :ప్రశ్నించే గొంతు ను హత్యలు చేస్తారా

### దోషులు ఎవరైనా శిక్షించవలసిం దే మాజీ శాసనసభ్యులు బాలరాజు

ప్రజాభూమి, జీలుగుమిల్లి



ప్రశాంతమైన ఏజెన్సీలో మర్డర్లు జరుగుతాయని తాను ఏనాడు ఊహించలేదని వైఎస్ఆర్సిపి మాజీ శాసనసభ్యులు తెల్లం బాలరాజు అన్నారు. పోలవరం నియోజకవర్గం జీలుగుమిల్లి మండలం తాటాకులగూడెం గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి కార్యకర్త గంధం బోసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన పోలవరం మాజీ శాసనసభ్యులు తెల్లం బాలరాజు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ గంధం బోసు నాలుగు రోజుల క్రితం హత్య గురవడం చాలా అమానుషం, దురదృష్టకరం, బాధాకరమని బాలరాజు అన్నారు. ప్రశాంతమైన ఏజెన్సీ ప్రాంతంలో ఎన్నడూ కూడా ఇటువంటి సంఘటనలు జరగలేదని ఇటువంటి హత్యలు జరుగుతాయని ఎవరు కూడా ఊహించి ఉండరని ఆయన అన్నారు. ఈ హత్య మీద అనేక అనుమానాలు ఉన్నాయని సమగ్రమైన, లోతైన విచారణ జరిగితే తప్ప ప్రజల్లో ఉన్న అనుమానాలు నివృత్తి అవుతాయని, నిష్పక్షపాతంగా విచారణ చేయాలని బాలరాజు తెలియచేసారు. ట్రాన్స్పరెంట్స్ గా విచారణ జరిగితే దోషులు ఎవరనేది తేలిపోతుందని, పోలీసు వారు త్వరగా దోషులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. బోసు వైయస్సార్సీపీ చురుకైన కార్యకర్తని, పార్టీ కోసం చాలా కష్టపడ్డాడని, ఈ తొమ్మిది నెలల కాలంలో కూటమి ప్రభుత్వాన్ని ఎక్కడెక్కడ నిలదీసి ప్రశ్నించారని బాలరాజు అన్నారు. ఇలా కష్టపడ్డ వ్యక్తి హత్యకు గురవడం అనేది చాలా విస్మయానికి గురి చేస్తుందని, ఏదేమైనా గాని నేను పోలీసు వారిని కోరుకునేది ఒకటేనని లోతుగా విచారణ చేసి దోషులు ఎవరైనా గానీ ఎంతటి వారైనా గానీ పట్టుకొని చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించాలని బాలరాజు డిమాండ్ చేశారు. అలాగే బోసు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రగాఢ సానుభూతి తెలియజేశారు, కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని బాలరాజు తెలియజేశారు. ఈయన వెంట వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు ప్రసాదు, జడ్పిటిసి, ఎంపీటీసీలు, సర్పంచులు, స్థానిక కార్యకర్తలు ఉన్నారు.

## చలో ఐ .టి .డి. ఎ. ను జయప్రదం చేయండి. (సిపిఎం).

**తవ్వి వదిలివేసిన ప్రధాన రహదారిని పూర్తి చేయాలి.**
**కారంగూడెం నుండి ముల్కనపల్లి మీదుగా కోడేరు వెళ్లే బిటి రోడ్డు అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డును నిర్మించాలి.**
**ముల్కనపల్లి నుండి వీరపాపనకుంట గ్రామానికి బీటీ రోడ్ సౌకర్యం కల్పించాలి.**
**జల్లివారి గూడెం, బంగారు గూడెం గ్రామాల మధ్యలో గల వాగు కు వంతెన నిర్మించాలి.**
**పోడు భూములు సాగు చేసుకున్నటువంటి ఆదివాసి గిరిజనులందరికి అటవీ హక్కు పత్రాలు ఇవ్వాలి.**





ప్రజాభూమి, వి.ఆర్.పురం.

ములకనపల్లి, కుందులూరు గ్రామపంచాయతీలో అపరిష్కృతంగా ఉన్నటువంటి సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26వ తేదీన జరిగే చలో ఐ టి డి ఏ ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. నర్సింగ్ పేట నుండి కుందులూరు మీదుగా పెదమట్టపల్లి వెళ్లే ప్రధాన రహదారిని గత ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణం పేరుతో రోడ్డును త్రవ్వి వదిలి వేయడం వలన నేటికీ కనీసం పాదచారులు కూడా నడిచి తిరగలేని పరిస్థితి దాపురించిందని అన్నారు. కారంగూడెం బి టి రోడ్డు జంక్షన్ నుండి ముల్కనపల్లి మీదుగా కోడేరు వెళ్లే బిటి రోడ్డు మొత్తం పాడైపోయి ప్రయాణానికి అసౌకర్యంగా ఉందని తెలిపారు. కుందులూరు గ్రామంలో మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంక్ ఉన్నప్పటికీ గత రెండు సంవత్సరాల నుండి మంచినీరే దొరికే పరిస్థితి లేదని, వీర పాపన్న కుంట గ్రామంలో అంగన్వాడి భవనం లేదని, అలానే ముల్కనపల్లి నుండి వీరపాపనకుంట గ్రామానికి బీటీ రోడ్ సౌకర్యం కల్పించాలని కోరారు. జల్లి వారి గూడెం నుండి బంగారు గూడెం వెళ్లే రోడ్డుకు మధ్యలో వాగు ఉండడం వల్ల వర్షాకాలంలో ప్రయాణానికి ఇబ్బంది కలుగుతుందని తక్షణమే వాగుకు వంతెన నిర్మించాలని అన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా అక్కడ గ్రామాల్లో బోర్లు వేసి పైపులైను కనెక్షన్లు ఇవ్వకపోవడం వలన మంచినీటికి ఇబ్బంది కలుగుతుందని వెంటనే అధికారులు స్పందించి పైపులైన్లు వేసి మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. రెండు పంచాయతీల్లో ఉన్నటువంటి మారుమూల గ్రామాలలో అంతర్గత రోడ్లు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని తక్షణమే అంతర్గత రోడ్లను మంజూరు చేయాలని కోరారు. పోడు భూములు సాగు చేసుకున్నటువంటి ఆదివాసి గిరిజనులందరికి అటవీ హక్కు పత్రాలు ఇవ్వాలని, డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ములకనపల్లి, కుందులూరు, తెల్లవారి గూడెం, వీర పాపన్న కుంట,గ్రామాలలో ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలను కదిలిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు, సున్నం రాజులు, మండల కమిటీ సభ్యులు పంకు.సత్తిబాబు, పొడియం శ్రీరామ్ మూర్తి, కమ్మసిచ్చు. సత్యనారాయణ, గుండుపూడి లక్ష్మణరావు, స్థానిక సర్పంచ్ సవలం. మారయ్య, స్థానిక గ్రామాల పెద్దలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఫారం పాండ్లకు శంకుస్థాపనలు

ప్రజాభూమి,వేలేరుపాడు



భూగర్భ జలాలను కాపాడేందుకుగానుఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా, చేపట్టిన ఫారం పాండ్లను వేలేరుపాడు మండలంలో రేపాక గొమ్ము,రుద్రంకోట గ్రామాలలో ఉపాధి హామీ అధికారుల సమక్షంలో భూమి పూజ చేసి కార్యక్రమం పనులు ప్రారంభం చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి స్థానిక మండల అభివృద్ధి అధికారి శ్రీహరి మాట్లాడుతూ, భూగర్భ జలాలు అడుగంటిపోకుండా నీటిని నిల్వ చేసుకోవడం దినియొక్క ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు. భవి తరాలకు మన ఇచ్చే ఆస్తి ఏదైనా ఉందా అంటే అది ప్రకృతి పరమైన నీరు,స్వచ్ఛమైన గాలి అని వాటిని పెంపొందించడనికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు తీసుకు రావడం జరుగు తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది కొవ్వల రాంబాబు, సురేష్, సౌజన్య, ఫీల్డ్ అసిస్టంట్ల వెంకటరమణ,తుంగ శ్రీనివాస్, జనసేన ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డి సుధాకర్, జనసేన సోషల్ మీడియా ఇన్చార్జి క్రాంతి కుమార్, రుద్రంకోట గ్రామంలో టీడీపీ నాయకులు అమరవరపు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామగిరి దేవాలయాన్ని సందర్శించిన దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్

ప్రజాభూమి, వి.ఆర్.పురం.





మండలంలోని శ్రీరామగిరి గ్రామం వద్ద శబరీ గోదావరి సంగమ తీరాన వెలసియున్న శ్రీ సుందర సీతారామచంద్ర స్వామి వారి దేవాలయాన్ని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కేవిఎల్ సుధారాణి శనివారం సందర్శించారు. ముందుగా ఆమె దేవాలయంలో వెలసి ఉన్న సీతా రాములు వారిని దర్శించుకొని పూజలు నిర్వహించుకుని, స్వామివారి కృపకు పాత్రులు అయ్యారు. అనంతరం దేవాలయం చుట్టూ తిరిగి ఆలయాయం చుట్టూ తిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2027 సంవత్సరంలో రానున్న పుష్కరాలకు సంబంధించి దేవాలయాల అభివృద్ధి పరిచేందుకు దేవాలయాలను సందర్శించి, పరిశీలిస్తున్నాని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ డిపార్ట్మెంట్ అధికారులు కూటమి నాయకులు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి.:మంత్రి వాసంశెట్టి సుభాష్.

ప్రజాభూమి,రామచంద్రపురం.





సమాజాన్ని పట్టి పీడిస్తున్న క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం సాయంత్రం వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్యాన్సర్ వ్యాధి బాధితులు, వారి సహాయకులుతో మంత్రి సుభాష్ తన క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. క్యాన్సర్ వ్యాధి పట్ల ఎవరు భయపడవద్దని, మనోధైర్యంతో వ్యాధిని ఎదుర్కోవాల న్నారు. వ్యాధి తీవ్రతను బట్టి మెరుగైన వైద్య సేవలు, అవసరమైన మందులు గుంటూరులోని ఒక ప్రైవేట్ హాస్పిటల్లో వైద్య సేవలు అందేలా ఇప్పటికే వైద్యులతో మాట్లాడామని, బాధితులు ముందుకొస్తే ఉచితంగా వైద్యం, మందులు అందిస్తామన్నారు. రామచంద్రపురం కెవిఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ నాగ సతీష్ కుమార్ కోట మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి ఏటా క్యాన్సర్ తో 70 వేలమంది చని పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు మామోగ్రఫి, పాప్ స్మియర్ పరీక్షలు, పురుషులు కొలనోస్కోపీ పరీక్షలు ముందుగా చేయించుకుని క్యాన్సర్ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 8 నుంచి 14 సంవత్సరాల మధ్య ఉన్న అమ్మాయిలు సర్వావాక్ వ్యాక్సిన్ ముందస్తుగా తీసుకుంటే క్యాన్సర్ ను రాకుండా అడ్డుకోవచ్చు అన్నారు. నిరంతరంగా దగ్గు, శ్వాస ఆడక పోవడం, బరువు తగ్గడం, అలసట, గడ్డలు, మల మూత్రాలలో రక్తం పడడం,నోటిలో పుండ్లు, తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుని వద్దకు వెళ్లాలని సూచించారు. మంచి ఆహారపు అలవాట్లు, రోజువారి వ్యాయామం, ఒత్తిడి లేని జీవితం అలవర్చుకోవడం ద్వారా క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చు అన్నారు. వ్యాధి బాధితుల వివరాలు నమోదు చేయడంతో పాటు, అవసరమైన కొన్ని మందులను ఉచితంగా మంత్రి తండ్రి, సత్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కౌన్సిలర్

ప్రజాభూమి, హిందూపురం టౌన్



మున్సిపల్ పరిధిలోని ముదిరెడ్డిపల్లి బాలికోనత పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని ఆ వార్డు కౌన్సిలర్ మహాలక్ష్మి నాగేంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మధ్యాహ్న భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా భోజన పదార్థాలను వడ్డిస్తున్నారా లేదా అని పరిశీలించారు. అనంతరం ఆమె విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని భుజించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కంబాలపాలెం మత్స్యకారుల పై వివక్షత చూపుతున్న ఏలేశ్వరం మత్స్యశాఖదికారి పై చర్యలు తీసుకోవాలి... - మత్స్య కారుల డిమాండ్..

ప్రజా భూమి ప్రతినిధి ఏలేశ్వరం



ఏలేశ్వరం మండలం మర్రివీడు శివారు కంబాలపాలెం కి చెందిన గంగపుత్రులు మత్స్యకార సంఘం సభ్యులు ఏలేశ్వరం మత్స్యశాఖ అధికారి రాజేంద్ర పై చర్యలు తీసుకోవాలని కంబాలపాలెం డిమాండ్ చేశారు. ఏలేశ్వరం మత్స్యాశాఖధికారి రాజేంద్ర తమ పై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. రాజేంద్రపై చ ర్య లు తీసుకోవాలంటూనినాదాలు చేశారు. తమ గ్రామంలో చేపట్టాల్సిన కార్యక్రమాన్ని తమ సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వేరొక ప్రాంతానికి మార్చారని ఆరోపించారు. లైసెన్స్ జారీ విషయంలో జాప్యం చేస్తున్నారంటూ ఆరోపించారు.తమ సమస్యలను ఉన్నతాధికారులు వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా మీడియాను ఆశ్రయించారు..దీనిపై రాజేంద్రన్ వివరణ కోరగా మత్స్యశాఖ ఆదేశానుసారం ప్రతి అంశంలో నియమ నిబంధనలకు అనుగుణంగా మేము పనిచేస్తున్నామని తెలిపారు. లైసెన్సు విషయానికి వస్తే మత్స్యకారులు వేటలో ఉపయోగించే వల పరిమాణాన్ని, పలు అంశాల అనుగుణంగా లైసెన్స్ ఫీజు అనేది ఉంటుందని తెలిపారు. ఇప్పటివరకు 18 లైసెన్స్ మాత్రమే జారీ చేశామని, ఇంకా ఎవరికీ లైసెన్స్ జారీ చేయలేదని రాజేంద్ర మీడియా కి తెలిపారు.

## జ్యోతుల నవీన్ కు 25 సంవత్సరాల పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేసిన తుమ్మలపల్లి రమేష్

ప్రజా భూమి, జగ్గంపేట



కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మరియు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గారి తనయుడు జ్యోతుల నవీన్ కుమార్ మరియు లక్ష్మీదేవి దంపతుల 25వ పెళ్లిరోజు పురస్కరించుకుని పరిణయ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన వేడుకకు హాజరైన జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్. ఈ సందర్భంగా నవీన్ లక్ష్మీ దేవి దంపతులకు 25వ పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేసి ఇలాంటి పెళ్లి రోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం గ్రామ సర్పంచ్ తుమ్మలపల్లి శేఖర్, కుంచె రాజా, ఎంపీటీసీ దొడ్డా శ్రీను,కోటి, కాకిలేటి బాబ్జి, ఉలిసి ఐరాజు,మాదారపు వీరబాబు,మొగిలి గంగాధర్,సింగూలూరి రాందీపు,సత్యంశెట్టి గణేష్, గోకేడ ప్రసాద్, కాయల మణికంత,సత్తి సోమరాజు,దేగల విజయ్, రాజనాల శ్రీను,సూరపురెడ్డి నరేష్,కర్ణాకుల సూరిబాబు, గంటా తేజ, డాక్టర్ నాని, విష్ణు,అడబాల వీరబాబు, గంధం శ్రీనివాస్ పాల్గొన్నారు

## మళ్లీ అధికారంలోకి వస్తాం కార్యకర్తలే పార్టీకి బలం

**రాష్టానికి వైయస్ జగన్ ను ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా పనిచేద్దాం**

**వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు**

ప్రజా భూమి కిర్లంపూడి



కిర్లంపూడిలో ప్రత్తిపాడు మండల ఎంపీటీసీ సభ్యులు తో వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు శనివారం సమావేశం ఏర్పాటు చేసి పార్టీని బలోపేతం చేసే విధంగా పనిచేయాలన్నారు. మండలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఎంపీటీసీలు పార్టీ మీద ఉన్న అభిమానంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జగన్ పై ఉన్న నమ్మకంతో అధికార పార్టీ వైపు చూడకుండా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న ఎంపీటీసీలకు, జడ్పిటిసిలుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని ఎవరు భయపడవద్దని ధైర్యంగా ఉండాలని పార్టీని బలపరిచే విధంగా ప్రతి ఒక్కరు కష్టపడి పని చేద్దామని గిరిబాబు పిలుపునిచ్చారు.మండలంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేద్దాం అని అందరితో సమన్వయంగా కలిసి పని చేసేలా ప్రతి ఒక్కరు నాకు సహకరించాలని గిరిబాబు కోరారు.

## వైసీపీకి గుడ్ బై చెప్పిన దళితనేతలు

### యనమల సమక్షంలో టీడీపీలోకి చేరిక

ప్రజా భూమి తుని



తుని నియోజకవర్గ తెలుగుదేశం దేశం పార్టీలోకి వలసల పరంపర కొన సాగుతోంది .తాజాగా ఇవాళ తొండంగి మండలం రావికంపాడు గ్రామ దళిత నేతలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు.తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు సమక్షంలో పాకా ఏసుబాబు,సారిక నాని బాబు,సవాలం గోపి,మంతెన అదృష్టం,గుల్ల పెద్ద శ్రీను,శివకోటి మరిడబ్బాయి,తదితరులతో సహాహరిజనవాడకు చెందిన వందమంది తెలుగు దేశం పార్టీలో చేరారు.వీరికి పసుపు కండువాలు వేసి తెలుగు దేశం పార్టీలోకి ఆహ్వానించిన యనమల రామకృష్ణుడు పార్టీకి నిస్వార్ధ సేవలందించే వారికి సముచిత గుర్తింపు లభిస్తుందని చెప్పారు ఈకార్యక్రమంలో సీనియర్ నేత యనమల రాజేష్ తో పాటు సిద్దా రాంబాబు,వెల్నాటి పాపయ్య రాజు,అరిగెల నర్సింహమూర్తి,పోసిన నంది బాబు,వెల్నాటి భరత్, మురళీ,ఆదం బాబ్జీ, ఖజానా,సిద్దా చంద్రరావు, వీరబాబు,చెలమయ్య పాల్గొన్నారు

## జ్యోతుల నవీన్ కు 25వ పెళ్లిరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన వనమాడి కొండబాబు

ప్రజా భూమి జగ్గంపేట



కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి దంపతుల 25వ సిల్వర్ జూబ్లీ వివాహ వార్షికోత్సవానికి విచ్చేసి నవీన్ లక్ష్మీదేవి దంపతులను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన కాకినాడ సిటీ శాసనసభ్యులు, వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) అమలాపురం శాసనసభ్యులు అయితా బత్తుల ఆనందరావు, అమలాపురం రూరల్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు

## మహిళలు భద్రతకు టీమ్స్, శక్తి యాప్ రక్షణ కవచం.: కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్

ప్రజా భూమి ప్రతినిధి కాకినాడ






ప్రతీ ఒక్క మహిళ ఫోన్లో నిక్షిప్తం చేసుకుని ఆపద సమయంలో పోలీసు వారి తక్షణ సహాయం పొందగలరని కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ శనివారం ఉదయం జిల్లా పోలీస్ కార్యాలయం నందు శక్తి టీమ్స్ ని ప్రారంభించినారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలు, బాలికలు భద్రత కొరకు శక్తి టీమ్స్, శక్తి యాప్ లను ప్రవేశపెట్టింది. ఈ యాప్ ప్రధానంగా మహిళల పై జరిగే వేధింపులు, అత్యాచారాలు, ఇతర హింసాత్మక సంఘటనలను నివారించటానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు కాబట్టి కాకినాడ జిల్లాలో ప్రతీ ఒక్క మహిళ, గృహిణిలు విద్యార్థినిలు, బాలికలు మీ యొక్క ఫోన్లు నందు ఈ శక్తి యాప్ ను నిక్షిప్తం చేసుకుని ఆపద సమయంలో పోలీసు వారి తక్షణ సహాయం, సహకారం పొందగలరని కాకినాడ జిల్లా ఎస్పీజి.బిందు మాధవ్ విజ్ఞప్తి చేసారు.కాకినాడ జిల్లాలో 4 బృందాలుగా శక్తి టీమ్స్ పని చేస్తాయని వీటిలో కాకినాడ సబ్ డివిజన్ పరిధిలో-3 ,పెద్దాపురం సబ్ డివిజన్ పరిధిలో -1 పనిచేస్తాయని తెలిపారు. ప్రతి బృందానికి మహిళా సబ్ ఇన్స్పెక్టర్ ఇన్చార్జిగా ఉండి పర్యవేక్షిస్తారని తెలిపారు.స్కూల్స్ , కళాశాలలు విడిచి పెట్టే సమయంలో, మహిళలు,బాలికలు ఉదయం వాకింగ్ సమయంలో మహిళల బాలికలకు భద్రత రక్షణ కల్పిస్తారన్నారు.ఈ కార్యక్రమంలో శక్తి యాప్ కు సంబంధించి "శక్తి యాప్" లోగోను ట్రైని ఏ ఎస్ పి కుమారి. సుస్మిత, ఐపీఎస్., ట్రైనీ డిఎస్పీ కుమారి జీవన, ఏపీపీఎస్ జిల్లా ఎస్పీజి బిందుమాధవ్ కి అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో శక్తి బృందాలకు కేటాయించిన 30 శక్తి పెట్రోలింగ్ వాహనాలను జిల్లా ఎస్పీ జండా ఊపు ప్రారంభించారు. ఈ శక్తి బృందాలు మహిళా మరియు బాలికల రక్షణ మరియు భద్రత విషయంలో అవసరమైతే బాడీవార్న్ కెమెరాస్ ఉపయోగిస్తారని తెలిపారు. ప్రజలు ఎక్కువగా చేరే ప్రాంతాలలో, మహిళలు బాలికలు రక్షణ భద్రత కల్పించే విధంగా " డ్రోన్" వినియోగిస్తామని తెలిపారు ఈ శక్తి బృందాలు మహిళా మరియు బాలికల రక్షణ విషయంలో బాధ్యతలు నిర్వహించే క్రమంలో అవసరమైతే దగ్గరలో గల పోలీస్ స్టేషన్ నందు సహాయం



తీసుకోవాలని తెలిపారు. మహిళా మరియు బాలికల ఎక్కువగా చేరే ప్రాంతాలలో మహిళలకు సంబంధించి చట్టాలను, వాళ్ల రక్షణ కొరకు ఏర్పాటు చేయబడిన హెల్ప్ లైన్ నెంబర్లను, డ్రగ్స్, సైబర్ నేరాలు వంటి వాటిపై తెలియపరచి, పిల్లలకు గుడ్ టచ్ -బ్యాడ్ టచ్ వంటి వాటిపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ శక్తి యాప్ మహిళలు బాలికలు వాళ్ల ఫోన్లలో ఎక్కువగా నిక్షిప్తం (డౌన్లోడ్) చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏ ఆర్ శ్రీనివాసరావు, ఎస్డిపిఓ కాకినాడ శ్రీ మనీష్ దేవరాజ్ పాటిల్, ఎస్డిపిఓస్ పెద్దాపురం శ్రీ హరి రాజు, ట్రైనీ ఏ ఎస్ పి కుమారి. సుస్మిత ఐ పి ఎస్ ట్రైనీ డీఎస్పీ కుమారి.జీవన, ఏ పి పి ఎస్ ఇన్స్పెక్టర్ మహిళా పోలీస్ స్టేషన్ రామచంద్రరావు, కాకినాడ పట్టణ ఇన్స్పెక్టర్లు, మహిళా సబ్ ఇన్స్పెక్టర్లు లలితాదేవి, లక్ష్మీకాంతం, దుర్గాదేవి మరియు మహిళ ఏఎస్ఎల్ హెడ్ కానిస్టేబుల్ కానిస్టేబుల్స్ అంగన్వాడీలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమము పి.రామచంద్రరావు, ఇన్స్పెక్టర్, మహిళా పోలీస్ స్టేషన్ కాకినాడ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.

## రాష్టం ల్లో మత్స్య సంపద అభివృద్ధి కి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వలు పనిచేస్తున్నాయి

**జిల్లా మత్స్యశాఖ అధికారి కృష్ణారావు**

ప్రజా భూమి ప్రతినిధి ఏలేశ్వరం



రాష్ట్రంలో మత్స్య సంపద పెంపొందించే విధంగా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని జిల్లా మత్స్యశాఖ అధికారి కృష్ణారావు తెలిపారు. ఏలేశ్వరం మండలం జె. అన్నవరం గ్రామ శివారు ఏలేరు జలాశయం వద్ద ఫిషరీస్ ఇన్స్పెక్టర్ రాజేంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా మత్స్యశాఖ అధికారి కృష్ణారావు, మత్స్య శాఖ సంఘ చైర్మన్ రంగారావులు హాజరయ్యారు. పలువురు నేతలు మత్స్య సంఘ సభ్యులు సమక్షంలో ఐదు లక్షల నాలుగువేల చేప పిల్లలను అధికారులు చేతుల మీదుగా ఏలేరు జలాశయంలోకి వదిలారు. ఈ సందర్భంగా మత్స్యకారులతో సమావేశ మై పలు అంశాలపై వారు చర్చించారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న జిల్లా మత్స్యశాఖ అధికారి కృష్ణారావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్య కారులను ఆదుకునే దిశగా మత్స్య సంపన్నులు పెంపొందిస్తున్నారని దానిలో భాగంగానే జిల్లా సమయంలో ఐదు లక్షల నాలుగు వేల చాప్టర్లను శనివారం వదలడం జరిగిందని తెలిపారు. వేట నిషేధిత సమయంలో మత్స్యకారులను ఆదుకునే దిశగా మత్స్య శాఖ ఉన్నదా అధికారులతో చర్చిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు ఎం లావణ్య, రాజేంద్ర, తదితరులుపాల్గొన్నారు

## వంతాడ గ్రామ గిరిజనులు సాగులో ఉన్నకొండపోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్..

**సిపిఎంఎల్ వినోద్ మిశ్రా ఆదివాసి గిరిజన సంఘం నాయకత్వంలో**

ప్రజా భూమి ప్రత్తిపాడు






ప్రత్తిపాడు మండల తాసిల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ ఎంఎల్ వినోద్విషా ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజన సాగులో ఉన్న కొండపోగులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం ధర్నా నిర్వహించారు.

ప్రత్తిపాడు మండలం లోని ఈ గోకవరం పంచాయతీకి చెందిన వంతాడ గ్రామంలో ఆదివాసి గిరిజను లైన కొండ దొర కులానికి చెందిన 69 కుటుంబాలు ఏలేశ్వరం అటవీ శాఖ పరిధిలోని లింగంపర్తి సెక్షన్ లింగంపర్తి బీట్ కంపార్ట్మెంట్ నెంబర్ 589. లో ఒక్కొక్క గిరిజన కుటుంబం 2 లేక 3 ఎకరాలు చొప్పున జీడి మామిడి తోటలు వేసుకుని గత 40 సంవత్సరాల నుండి సాగు చేసుకుంటూ అదే జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్నారన్నారు.వారికి గ్రామంలో అభివృద్ధి పనులు గాని జాతి ఉపాధి హామీ పనులు గాని ఏటువంటి కూడా లేవని వాపోయారు. వారు పూర్వం నుండి ఎత్తైన నాగులకొండ పర్వతం మీదనే జీవనం సాగిస్తూ ఉన్నమ్మన్నారు .. జనాభా 500 మంది వరకు ఆ గ్రామం లో నివాసం ఏర్పాటు చేసుకొని జీవిస్తూన్నమ్మన్నారు. తాము 150 గిరిజన షెడ్యూల్ తెగకు చెందిన జాతివారమని తమ కుటుంబాలు కొండ దొర కులమునకు చెందిన వారేఉంటామన్నారు. మా గ్రామంలో కోట్లాది వేల రూపాయల లెట్రేట్ ఖనిజ సంపద ఉందని దానిని దళారులు దోసుకుపోతున్నారని ఆరోపించారు. మా బతుకుల మాత్రం నిజం గా అడవిలోనే మగ్గిపోతు న్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. మాకు ఎండిన పుల్లలు కాల్చు కొంటూ వాటిని అమ్ముకోవడం తప్ప మరో జీవన మార్గం లేదన్నారు. కొంతమంది రాజకీయ పెత్తందారులు మా సాగులో ఉన్న కొండ పోడు భూములకు.పట్టాలు మంజూరు కానివ్వకుండా. ప్రభుత్వ అధికారులకు అడ్డు పెడుతూ గిరిజనుల హక్కులను హరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. నేటికీ కూడా వంతాడ గ్రామ గిరిజనులకుఎటువంటి హక్కులు లేకుండా ఆ పెద్దలు చేశారన్నారు.మా గ్రామం లో నీటి వసతి సదుపాయం లేదని ఆరోగ్య పరంగా ఎటువంటి ఆసుపత్రి లేదని వాపోయారు.బయటకు రావడానికి ఏలేశ్వరంకు వెళ్ళటకు కొండ తిమ్మాపురం వరకు వేసిన రోడ్డు మంజూరు అయినప్పటికీ రోడ్డు పూర్తి అవకుండా బిల్లులు చేసుకుని ఆ సొమ్ముని మింగేశారన్నారు. రోడ్డు మాత్రం వెయ్యలేదు తాము రాళ్లతో ఇబ్బందుల తో ప్రమాదం గానే తమంతా కొండలు దిగుతున్నామన్నారు మా గిరిజనుల సాగులోఉన్న కొండ పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ వంతాడ గ్రామ గిరిజన ప్రజలు మండల తాసిల్దారు కి వినతి పత్రంన్ని ఇచ్చి తమ గోడు జిల్లా, రాష్ట్ర ఉన్నంతదికార్ల దృష్టికి తీసుకు వెళ్ళి సత్వరం పరిష్కరెందుకు కృషి చేయాలని వారు తాసిల్దార్ కి విన్నవించుకున్నారు . ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ వినోద్ మిశ్రా ఆర్గనైజేషన్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి కోసిరెడ్డి గణేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొనగా ఉల్లి తాతారావు కూడే రాఘవ మాతే దుర్గ బాబు ఉల్లి లవకుశల మాతే లోవరాజు ఈరటచంటిబాబు మాతే లవకుశల కూడే రెడ్డి బాబు కూడే లోవరాజు ఉల్లిలక్ష్మి. కోటిపల్లి కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సభకు సమాచారం ఇవ్వకపోవడం పై ఆగ్రహం

ప్రజాభూమి గండేపల్లి.



గ్రామ కార్యదర్శి,ఫీల్డ్ ఫీల్డ్ అసిస్టెంట్ లపై చర్యలు తీసుకోవాలి -గ్రామసభను రద్దు చేయాలంటూ డిమాండ్ -ఏవో సర్ది చెప్పడంతో సమస్య పరిష్కారంగ్రామంలో ప్రథమ పౌరురాలైన తనకు, సభ్యులకు, గ్రామ పెద్దలకు ఎటువంటి సమాచారం లేకుండా గ్రామ కార్యదర్శి నియంతృత్వ ధోరణిలో గ్రామ సభ నిర్వహించడం పై గ్రామ సర్పంచ్ బల్లి రెడ్డి వరలక్ష్మి గంగరాజు, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామ సభను అడ్డుకొని ఏ విధంగా సభ నిర్వహిస్తారు అంటూ ఆందోళన చేపట్టారు. దీంతో సమాచారం తెలుసుకున్న ఎంపీడీవో నాతి బుజ్జి హుటాహుటిన ఏవో చంద్రావును సమావేశానికి పంపించడంతో గ్రామస్తులకు సర్ది చెప్పి సభను యధాతధంగా సర్పంచ్ వరలక్ష్మి గంగరాజు అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వరలక్ష్మి గంగరాజు,గ్రామ పెద్దలు కాటేపల్లి వీరభద్రరావు, దిడ్డి చిన్న శ్రీను, రామకుర్తి నరసింహం మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సూరిబాబు గత ఏడాది కాలంగా ఉపాధి పనులకు వెళ్లకుండా వాళ్ళ భార్యను పంపించి అసిస్టెంట్ బాధ్యతలు ఆమెతో చేయిస్తున్నాడని దీనివలన అనేక అవకతవకలకు పాల్పడుతున్నారని కనీసం గ్రామసభకు హాజరు కాకపోగా అతని భార్య సమాధానం చెప్పడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేసి దీనిపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేశారు.అదేవిధంగా గ్రామ సభ నిర్వహణ విషయమై సమాచారం ఇవ్వని కార్యదర్శి పైన చర్యలు తీసుకోవాలంటూ వారు కోరారు.గ్రామ సభ సమావేశము ప్రారంభమైన తర్వాత మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాతి బుజ్జి హాజరై సామాజిక తనీఖీ నందు గుర్తించిన అంశముల పై సామాజిక తనిఖీ బృందం సర్పంచ్ తో చర్చించారు.ఈ గ్రామ సభ సమావేశము నందు గ్రామ సభ అబ్జర్వర్ గా మండల విద్యాశాఖాదికారి కె. హున్య నాయక్ , ఎస్. ఆర్. పి. పి. సింహాద్రి, ఎన్.ఆర్.జి.యస్. ఏ.పి.ఓ. ఆర్. గంగాభవాని, ఇంజనీరింగ్ కన్సలెంట్ పి.రమేష్, టెక్నికల్ అసిస్టెంట్, ఇ. శ్రీను బాబు, పాల్గొన్నారు.

## బీహార్ కార్మికులకు శుభాకాంక్షలు తెలిపిన బిజెపి నాయకులు

ప్రజా భూమి గండేపల్లి.

కేంద్ర,రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు భిక్కిన విశ్వేశ్వర రావు ఆదేశాల మేరకు బీహార్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గండేపల్లి మండలం యల్లమిల్లి లో గల జెట్టి గ్రానైట్ క్వారీ లో పని చేస్తున్న బీహార్ కార్మికులకు స్వీట్ లు పంచి శుభాకాంక్షలు తెలియ చేసారు.వారికి భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని తెలియ చేసి అన్ని వేళల అందుబాటులో వుంటామని జగ్గంపేట నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ ధాట్ల కృష్ణ వర్మ తెలిపారు. ఈ కార్య క్రమం లో గండేపల్లి మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు తోరాటి వెంకన్న, జగ్గంపేట మండల అధ్యక్షుడు పల్ల రాము, కిర్లంపూడి మండల అధ్యక్షుడు సరకణం రాజబాబు,యాళ్ళ విష్ణు,పెనుమత్స సుబ్బరాజు, పాల్గొన్నారు.



ప్రజాభూమి



## సీనియర్ జర్నలిస్టు చింతం వెంకటేశ్వరరావు కి అశ్రు నివాళులు ..

. ప్రజా భూమి కొత్తపేట



కొత్తపేట నియోజకవర్గంలో కొత్తపేట, రావులపాలెం మండలాల్లో సుధీర్ఘ కాలం పాటు జర్నలిస్టుగా పనిచేసే పలువురికి మార్గదర్శకంగా నిలిచిన చింతం వెంకటేశ్వరరావు మృతి పాత్రికేయ మిత్రులకు తీరని లోటు. మూడు దశాబ్దాల పాటు ఈనాడు ,ఆంధ్రజ్యోతి పత్రిక లలో విలేకరిగా వెంకటేశ్వరరావు విశిష్ట సేవలు వార్తా రూపంలో అందించారు. సమాజ సేవలో భాగయ్యారు.కొత్తపేట సమితి మాజీ అధ్యక్షులు చింతం వెంకట రామయ్య రెండో కుమారులైన వెంకటేశ్వరరావు ,, (మందపల్లి మాజీ సర్పంచ్ చింతం కృష్ణ సోదరుడు) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం హైదరాబాద్లో వారి కుమార్తె నివాసంలో మృతి చెందారు. ఆయన మరణ వార్త భాధ కలిగించింది. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము అంటూ కొత్త పేట జర్నలిస్ట్ యూనియన్ పేర్కొంది.

## వైభవంగా ఎంపి హరిష్ మాధురీపుట్టినరోజు వేడుకలు

ప్రజాభూమి అమలాపురం




కోనసీమ ముద్దు బిడ్డ అభివృద్ధి ప్రధాత లోక్ సభ మాజీ స్పీకర్ స్వర్గీయ గంటి మోహన చంద్ర బాలయోగి తనయుడు అమలాపురం ఎం పి హరీష్ మాధురీ పుట్టిన రోజు వేడుకలు శనివారం అమలాపురంలో ఎర్ర వంతెన వద్ద ఘనంగా నిర్వహించారు. స్వాగత ద్వారాల వద్ద బారీ పూల దండలు జెసిబిల సహాయంతో సిద్దంచేసారు.బాణాసంచా కాలుస్తు భాజాభంత్రిలతో వేధిక వద్దకు ఊరేగింపుతోతీసుకుని వచ్చారు. కేక్ కటింగ్ చేయించిన వెంటనే నాయకులుశుభాకాంక్షలు తెలిపేందుకు బారీసంఖ్యలో క్యూ లో నిలిచి బొకెన్లతొ పూలదండలతో శాలువాలతో సత్కరించేందుకు పోటీ పడ్డారు .దివ్యాంగులకు మోటారు వాహనాలనుఅందజేసారు.రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.పుట్టిన రోజు వేడుకలో పాల్గొన్నవారందరికి విందు వేర్పాటు వేసారు. టిడిపి శ్రేణులు కూటమి నాయకులు అధికారులు తోపాటు పాత్రికేయులు అమలాపురం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కొండే పూడి సత్యనారాయణ అధ్వర్యంలో చొల్లంగి అప్పాజీ బిఎ జె డబ్ల్యు రెడ్డి బాబు కుడుపూడి సుబ్బారావు టి గోయింద్ దడాల త్రిమూర్తులు వాకపల్లి వెంకన్న ఆకుల తేజ శుభాకాంక్షలు తెలిపారు. అమలాపురం ఎం ఎల్ ఏ అయితా బత్తుల ఆనందరావు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుబాష్ ఎంఎల్ఏలు గిడ్డి సత్యనారా యణ దాట్ల బుచ్చిబాబు క్షత్రియ కార్పోరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు రాష్ట్ర టిడిపి కార్య దర్శి మెట్ల రమణబాబు అముడా చైర్మెన్ అల్లాడ స్వామినాయుడు కంకటాల రాంబాబు శుభాకాంక్షలు తెలిపారు.

## బాయ్స్ హాస్టల్స్ ను ఆకస్మిక తనిఖీ చేసిన వీసీ ప్రసన్న శ్రీ

ప్రజా భూమి ప్రతినిధి రాజమహేంద్రవరం



ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని మెన్ హాస్టల్ ను వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ, రాజమండ్రి కేంద్ర కారాగారం పర్యవేక్షణ అధికారి ఎస్. రాహుల్ తో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. విశ్వవిద్యాలయంలో విసి ఆచార్య ప్రసన్నశ్రీ ని కలిసిన కేంద్ర కారాగారం పర్యవేక్షణ అధికారి ఎస్ రాహుల్ తో విశ్వవిద్యాలయానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. తరువాత బాయ్స్ హాస్టల్ లోని వంట గదిని, విద్యార్థులు భోజనం చేసే మెస్ హాల్ ను పరిశీలించారు. వీసీ విద్యార్థులతో మాట్లాడి హాస్టల్ నిర్వహణ, మెస్ నాణ్యతపై ఆరా తీశారు. హాస్టల్ నిర్వహణ సిబ్బంది అందరూ నిబద్ధతగా పని చేయాలని, పరిశుభ్రంగా హాస్టల్ ను నిర్వహించాలని అన్నారు. పరిశుభ్రత విషయంలో సిబ్బంది, విద్యార్థులు వ్యక్తిగత బాధ్యత వ్యవహరించాలన్నారు. హాస్టల్ మెస్ ను మరింత నాణ్యతగా ఏ విధంగా నిర్వహించవచ్చు అనే సూచనలను రాజమండ్రి కేంద్ర కారాగారం పర్యవేక్షణ అధికారి రాహుల్ తెలియజేశారు. కేంద్ర కారా గారంలో తాము తీసుకున్న కొన్ని ప్రత్యేక కార్యక్రమాలను సూచించారు. హాస్టల్ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, మంచిగా చదువుకొని ఉన్నతంగా జీవించాలని తెలియజేశారు. విశ్వవిద్యాలయానికి అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి తాము సిద్ధంగా ఉంటామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ చీఫ్ వార్డెన్ ఆచార్య ఎస్.కె.శ్రీరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మన దేశ విశిష్టత, గొప్పతనం గురించి తెలపాలి..

### రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు

ప్రజాభూమి గోకవరం:



విద్యార్థులకు చిన్నప్పటి నుంచే మన భారతదేశ విశిష్టత, గొప్పతనం, సంస్కృతి, సాంప్రదాయాలు గురించి వారికి తెలపాలని విశ్వహిందు ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక అచ్చియ్యపేటలోని శ్రీ సీతారామ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్ద ప్రిన్సిపాల్ చింతాడ విజమ్ రాజు రత్నం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బ్లూ కలర్స్, ఫ్రూట్స్ డే, మరియు పాఠశాల 34వ వార్షికోత్సవ వేడుకలకు విశ్వహిందూ దర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికి, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఇతర రంగాల్లో కూడా ప్రావీణ్యం సంపాదించాలన్నారు. మన భారతదేశం విశ్వ గురువు అని మన మునీశ్వరులు, ఋషులు ప్రాచీన కాలంలోనే ఎంతో పరిజ్ఞానాన్ని పొందపరిచారన్నారు. మన దేశంలోనే అనేక అంశాలను కనిపెట్టడం జరిగిందన్నారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థికి కూడా భారతీయత గురించి, నేర్పించాలన్నారు. ఎవరు కూడా కుల, మతాలని విడిపోకుండా మనమందరం భారతీయులనే భావనతో అన్న, తమ్ముల్లాగా కలిసి ఉండాలన్నారు. విద్యార్థులకు సమాజంలో ఎలా మెలగాలి, ఇతరులను ఎలా గౌరవించాలి, ఎప్పటికప్పుడు కొత్త, కొత్త విషయాలను నేర్పిస్తూ ఉండాలన్నారు. విద్యార్థులకు సహాయ, సహకారాలు అందించడానికి తాను ఎప్పుడు ముందుంటానన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో గోకవరం బీజేపీ మండల అధ్యక్షులు ఇనకోటి బాపన్న దొర, నాయకులు వరసాల ప్రసాద్, దాసరి దర్మరాజు, బత్తుల నానాజీ, నాగ రమేష్, శ్రీమతి వీరాంజలి, దేశాల నరేష్, పసల గణేష్, పచ్చారి నరసింహామూర్తి, దేశాల కృష్ణార్జునరావు, పద్దరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చింతకుంట లో పిడుగు, మంగపట్నంలో వడగండ్లు

ప్రజాభూమి ముద్దనూరు

రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ కురుస్తున్న అకాల వర్షాలలో భాగంగా చింతకుంట లో టెంకాయ చెట్టు పై పిడుగు, మంగపట్నంలో వడగండ్ల వాన శనివారం కురిసింది. చింతకుంట లో ఓ ఇంటి ఎదురుగా టెంకాయ చెట్టు అలాగే సంబంధిత ఇళ్ళ సమీపంలో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పి అగ్నికి ఆహుతి అయింది పెను ప్రమాదం తప్పిందని ప్రజలు భావించగా, మంగపట్నంలో వడగండ్ల వాన పడడంతో కొన్ని సంవత్సరాలుగా ఇలాంటి వర్షం చూడని తమ ఇళ్ళనుంటే వీడియోలు తీస్తూ వైరల్ చేస్తున్నారు.





## జలభద్రత తోనే భవిత సురక్షితం కలెక్టర్ మహేష్ కుమార్

ప్రజా భూమి అమలాపురం





జల భద్రత తోనే భవిత సురక్షితమని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ పేర్కొన్నారు.ప్రపంచ జల దినోత్సవాన్ని నాబార్డ్ అంబేద్కర్ కోనసీమ జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కలెక్టర్ కార్యాలయమందు శనివారం ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జల సంరక్షణపై దిశా నిర్దేశం చేస్తూ భవిష్య త్తులోఎదుర్కొనబోయే నీటి యాజమాన్య సవాళ్ళను గురించి ప్రస్తావించి తదనుగు ణంగా శాస్త్రవేత్తలు, అధి కారులు, మరియు సం బంధిత సంస్థలు సంయుక్త ప్రణాళికలు రచించుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. నీటి ప్రాముఖ్యత, సరఫరా, పరిరక్షణ అవసరాన్ని గుర్తు చేసుకోవడం దీని ముఖ్య ఉద్దేశ్యమన్నారు భవి ష్యత్తులో ఎదురయ్యే నీటి సంక్షోభాలను అధిగమిం చేందుకు ప్రజల్లో అవగాహన పెంపొందించాలనేది ప్రధాన లక్ష్యమన్నారు. 2025 ప్రపంచ జల దినోత్సవాన్ని హిమానీనదాల సంరక్షణ, మంచినీటి వనరుల రక్షణ, వాతా వరణ మార్పుల ప్రభావాన్ని అరికట్టే చర్యలపై చర్చించేందుకు ఉద్దేశించా రన్నారు నీటి వనరుల లభ్యత సుస్థిరంగా సాగేలా చేయడంలో హిమానీ నదాలదే కీలక పాత్రని అయితే భూతాపం హిమానీ నదాల వేగంగా కరగడంతో జల భద్రతకు తీవ్రమైన ముప్పును కలిగిస్తున్నాయని అధ్యయనాలు సూచిస్తు న్నాయన్నారు హిమానీ నదాల సంరక్షణ అనేది కేవలం భౌగోళిక అంశమే కాదని. ఇది ప్రజలందరి ప్రగతికి, జీవన విధానానికి కీలకమన్నారు మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నీటి వనరుల పరిరక్షణ అనే అంశంపై జరిగిన ఈ సదస్సు లో జాతీయ జల సంస్థకు చెందిన శాస్త్ర వేత్త వై శివ ప్రసాద్ పాల్గొని తమ పరిశోధనా అంశాలను సదస్సుకు హాజరైన వివిధ శాఖల అధికారులతో పంచు కున్నారు. కోనసీమ జిల్లా అటవీ అధికారి ఎం వి ప్రసాదరావు పాల్గొని ప్రసం గిస్తూ, కోనసీమ జిల్లాలో తీరా ప్రాంత కొత్త, మడ అడవుల పరిరక్షణ, ఉప్పు నీటి ప్రవాహాలతో ముప్పు తదితర అంశాల పై చర్చించారు. సముద్ర తీరం వెంబడి ఉన్న మడ అడవుల సంరక్షణ ద్వారా తీరప్రాంత ప్రజా నీకం సంరక్షింపబడుతు న్నారని అదేవిధంగా మత్స్య సంపద అభివృద్ధి ఈ అడ వులు దోహద పడుతున్నా యన్నారు జీవవైవిధ్యం సమతుల్యత, జీవనోపాదులు పెంపుదలకు సహజ వనరుల బలోపేతానికి మడ అడవులు దోహదపడతాయన్నారు.అదే విధంగా, పరిసరాల పరిశుభ్ర త అనేది ఒక సామాజిక బాధ్యతగా పాటించటం ద్వారా మాత్రమే ఆరోగ్య కరమైన వాతావరణం సృష్టించడం సాధ్యపడుతుం దని సూ చించారు ఈ సంద ర్భంగా భవిష్యత్తులో వాతా వరణంలో మార్పులు, జల వనరులపై దాని ప్రభావం సవాళ్లు ఎదుర్కొనాల్సిన అంశాలపై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో జాతీయ జల సంస్థకు చెందిన శాస్త్రవేత్త శివప్రసాద్ పెరుగుతున్న వాతావరణ మార్పులవలన గోదావరి డెల్టా భూగర్భ జలవన రులలో పెరుగుతున్న సాలైనిటీ మరియు ఇతర మార్పులను నిశితంగా వివరించారు. ఈ కార్యక్రమములో జిల్లా నీటి యాజమాన్య సంస్థ, జిల్లా భూగర్భ జలవనరులు, నీటి లభ్యత సంరక్షణ అంశాలపై నీటి పారుదలశాఖ, వివిధ శాఖల అధికారులు చర్చిం చడంతో పాటుగా జల సంరక్షణ భవిష్యత్ తరాలకు జల సంపద అందించే అంశాల భద్రతపై ప్రసం గించారు.నాబార్డ్ డి.డి.ఎం డాక్టర్ వై.యస్. నాయుడు తన ప్రెసెంటేషన్ ద్వారా వాతా వరణ మార్పులకు సంబం ధించి నాబార్డ్ ద్వారా వ్యవసాయ మరియు అను బంధ రంగాలలో ప్రాజెక్టులు ఏర్పాటు చేయడంతో పాటు గా కాట్రేనికోన ప్రాంతంలో ఎండు చేపల తయారీ కొరకు సోలార్ డ్రైయర్స్ కొరకు నాబార్డ్ ద్వారా యూనిట్లు ప్రతిపాదించడం జరిగింద న్నారు. వాతావరణ మార్పుల చర్యలపై అవగాహన సదస్సు కు విచ్చేసిన అధికారులు, శాస్త్ర వేత్తలు,ఎన్.జి.ఓ. తదితర చమురు సహజ వాయువు సంస్థల ప్రతిని ధులు లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో ఉమ్మడిగా చర్చించారు ఈ కార్య క్రమంలో ఎల్డీఎం కేశవ వర్మ, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు తదిత రులు పాల్గొన్నారు

## చిత్ర కళా నైపుణ్యంతో జీవన వికాసం వస్తుంది

### గువ్వల కెనడీ స్మారక చిత్ర కళా ప్రదర్శనను ప్రారంభిస్తూ "రౌతు "

ప్రజా భూమి రాజమహేంద్రవరం

చిత్ర కళా రంగంలో సాధించిన నైపుణ్యం మనిషి జీవన వికాసానికి దోహదం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే,రుడా మాజీ చైర్మన్,వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రౌతు సూర్యప్రకాశరావు అన్నారు.క్రియేటివ్ వరల్డ్ ఆధ్వర్యంలో కళాస్మృతి పేరితోదివంగత చిత్ర కళా కారుడు గువ్వల కెనడీస్మృత్యర్థం శనివారం స్థానిక గౌతమ ఘాట్ లోని చాంబర్ ఆఫ్ కామర్స్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల చిత్ర కళా ప్రదర్శనను రౌతు సూర్యప్రకాశ రావు ప్రారంభించారు.ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారుసాంకేతికంగా మనం ఎంత ఎదిగినా, సహజ సిద్ధమైన చిత్ర కళా ప్రదర్శనను చూసినప్పుడు పొందే అనుభూతి మధురంగా ఉంటుందని, అది ఎందులోను దొరకదని వివరించారు. ఎం.ఎఫ్ . హుస్సేన్ చిత్రించిన చిత్ర పటం 120 కోట్లకు అమ్ముడయ్యిందంటే చిత్ర కళా నైపుణ్యం ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు అన్నారు.కెనడీ చిత్రించిన కొన్ని కళా చిత్రాలను దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీలో పెట్టేందుకు పెద్దలతో కలిసి కృషి చేస్తానని చెప్పారు.ఎందరో కళాకారులు జన్మించిన రాజమండ్రిలో గువ్వల కెనడీ చిత్రించిన కళా ఖండాలు అద్భుతమైనవని గుర్తు చేశారు. కెనడీ చిత్ర కళా వారసత్వాన్ని వారి భార్య, పిల్లలు కొనసాగించడాన్ని ఆయన అభినందించారు.ఈ సందర్భంగా కళా స్మృతి 2025 పేరిట ముద్రించిన బుక్ లెట్ ను రౌతు సూర్యప్రకాశరావు ఆవిష్కరించారు.కళా కారుల స్మృతిని చిరస్థాయిగా నిలిపేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కళా స్మృతి నిర్వాహకులు గువ్వల పద్మ, గువ్వల హిమబిందు వర్మ మాట్లాడుతూ మొబైల్ ఫోన్ల సంస్కృతి లో మన చారిత్రక చిత్ర కళా నైపుణ్యం ఆదరణ కోల్పోవడం మంచి పరిణామం కాదన్నారు. భవిష్యత్ తరాలకు మన సంస్కృతిలో భాగమైన చిత్ర కళా నైపుణ్యాన్ని తెలియ చేసేందుకే ఈ చిత్ర కళా ప్రదర్శనను



ఏర్పాటు చేసినట్లు హిమ బిందు వర్మ చెప్పారు. క్రియేటివ్ ఆర్ట్ వరల్డ్ ను స్థాపించి 20 ఏళ్ళు అయిందని గుర్తు చేశారు.అందరూ ఈ చిత్ర కళా ప్రదర్శనను తిలకించి సహకారం అందించాలని కోరారు. ఆదివారం కూడా చిత్ర కళా ప్రదర్శన జరుగుతుందని వివరించారు.ప్రదర్శనతో పాటు విక్రయాలు కూడా ఉన్నాయని చెప్పారు.చిత్ర కళా ప్రదర్శనలో ఎకర్లిక్, ఆయిల్ పెయింట్స్, వాటర్ కలర్స్, పెన్సిల్ స్కెచ్,ట్రెడిషనల్ ఆర్ట్ చిత్రాలను ఉంచామని తమ సంస్థలోని 26 మంది కళాకారులు విభిన్న రీతుల్లోచిత్రించిన చిత్రాలను ప్రదర్శనలో ఉంచామని వివరించారు.మరిన్ని వివరాలకు తనను ( హిమబిందు)8123887582 నెంబరు లో సంప్రదించవచ్చు అని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ యాదవ సంఘం జిల్లా అధ్యక్షులుగా బర్ల...!



ప్రజాభూమి, రామచంద్రపురం.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా శ్రీకృష్ణ యాదవ్ సంఘం నూతన అధ్యక్షులుగా రామచంద్రపురం నియోజకవర్గ బీసీవై పార్టీ ఇంచార్జ్ బర్ల శ్రీనివాస్ యాదవ్ ఏకగ్రీవంగా ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఏర్పాటుచేసారు.తొలుత ప్రత్యేక సమావేశం అమలాపురం పట్టణ, కొంకాపల్లి ఎత్తు రోడ్డు మైదానంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బర్ల శ్రీనివాస్ యాదవ్ ని ఏకగ్రీవంగా నూతన జిల్లా అధ్యక్షునిగా ఎన్నుకున్నారు.

ఈ కార్యక్రమంలో యాదవ సామాజిక వర్గం రాజకీయ, సామాజిక అభివృద్ధి, యువతకు అవకాశాల కల్పన, విద్య ఉద్యోగాల్లో ప్రోత్సాహం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టికి ఆకర్షించేందుకు కార్యచరణ రూపొందించాలని సమావేశం లో నిర్ణయించారు. అలాగే యాదవ వర్గానికి రాష్ట్ర రాజకీయాల్లో సముచిత స్థానం లభించాలనే నినాదం తో బలోపేతం చేస్తూ, రాష్ట్ర స్థాయిలో ఒక ప్రత్యేక సంఘాన్ని ఏర్పాటు చేయాలనే అభిప్రాయాన్ని ఈసందర్భంగా కార్యవర్గ సభ్యులు వ్యక్తం చేశారు.

**బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నూతన కార్యవర్గం**

జిల్లా గౌరవాధ్యక్షులుగా అమలాపురం నియోజకవర్గం చెందిన కోరశిఖ వీర వెంకట సుబ్రమణ్యం జిల్లా అధ్యక్షులుగా రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన బర్ల శ్రీనివాస్ యాదవ్ (రామచంద్రపురం నియోజవర్గం బీసీవై పార్టీ ఇంచార్జ్ ) జిల్లా ఉపాధ్యక్షులుగా మందపాటి వెంకటేశ్వరరావు జిల్లా ప్రధాన కార్యదర్శిగా గుండుమేను ప్రసన్న మణికంఠ స్వామి జిల్లా యువజన అధ్యక్షులుగా మందపాటి బాలు యాదవ్ గా యువజన ఉపాధ్యక్షులు గా ఆమజాల శ్రీను జిల్లా మహిళా అధ్యక్షురాలుగా చేకూరి శ్రీలక్ష్మి జిల్లాసలహా దారులుగా చిట్టిమేను వీరవెంకట సత్యనారాయణ జిల్లా సహాయ-సలహాదారులుగా భయ్యా రాంబాబు జిల్లా కోఆర్డినేటర్గా ఆమజాల శ్రీనివాస్ యాదవ్ జిల్లా కన్వీనర్గానూని రామకృష్ణ జిల్లా కో -కన్వీనర్గా మట్ట సోమరాజు జిల్లా సంయుక్త కార్యదర్శిగా సూరిబోయిన సుబ్రమణ్యం జిల్లా ట్రెజరర్గా పాశం చింతారావు జిల్లా కో ట్రెజరర్గాదండు బోయిన శ్రీనివాసరావు జిల్లా లీగల్ అడ్వైజర్గా ఉప్పల ప్రవీణ్ జిల్లా విద్యా సాంకేతిక కన్వీనర్గా గుండు మేను శ్రీనివాస్ రావుజిల్లా ఉద్యోగ కన్వీనర్గా మల్లిపూడి రామకృష్ణ జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా కన్వీనర్గా కానుబోయిన దుర్గాప్రసాద్ జిల్లా వ్యాపార, వాణిజ్య కన్వీనర్గా వంటపాటి మహేష్ జిల్లా వ్యవసాయ కన్వీనర్గాగుండుమేను సతీష్ జిల్లా ఆరోగ్య కన్వీనర్గా కోరశిక రామచంద్ర మూర్తి జిల్లా ఎన్నారై కన్వీనర్గా దండు మేను విజయ్ జిల్లా వివాహ పరిచయ కన్వీనర్గా గోళ్ల శ్రీను జిల్లా సహాయ కార్యదర్శిగా మందపాటి రామకృష్ణ జిల్లా సహాయ కార్యదర్శిగా గాలి వీర వెంకట రాంబాబు జిల్లా సహాయ కార్యదర్శిగా మన్నె వేంకటేశ్వర



రావు , జిల్లా సహాయ కార్యదర్శిగా వీరోతి కిరణ్ జిల్లా సహాయ కార్యదర్శినాగళ్ళ పుల్లయ్య జిల్లా సహాయ కార్యదర్శిగా వంటపాటి వీరబాబు తదితరులను ఏకగ్రీవంగాఎన్నుకున్నారు.ఈకార్యక్రమంలో రామచంద్రపురం నియోజవర్గ యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారునియోజకవర్గం అధ్యక్షులు దాసరి శ్రీనివాస్ యాదవ్ పట్టణ అధ్యక్షులు కిలారపు బద్రీనాథ్, నూజివీడు రాంబాబు యూత్ ప్రెసిడెంట్ మండపేట, పట్టపగల రాంబాబు వైస్ ప్రెసిడెంట్ మండపేట, అమ్మజాల శ్రీను మండపేట సంఘం సభ్యులు మల్లిపూడి రామకృష్ణ, మట్ట మహేష్, గోనుమిల్లి తాతాజీ, మన్ని బద్రి, మల్లిపూడి అయ్యప్ప, తదితరులు పాల్గొని, నూతనంగా ఎన్నికైన సంఘానికి తమ పూర్తి మద్దత్తు ప్రకటించారు.ఈ సందర్భంగా కొత్తగా ఏర్పడిన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ, సంఘటిత శక్తితో మాత్రమే సమాజంలో మార్పు తీసుకురాగలం అనే నినాదాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమాజానికి సేవ చేయడం, కొత్త తరం యువతకు దిశా నిర్దేశం చేయడం తమ ప్రధాన లక్ష్యమని వీరంతా తమతమ అభిప్రాయాలను తెలియజేశారు.

## పరీక్ష కేంద్రాల నిర్వహణను పరిశీలించిన వీసీ ప్రసన్న శ్రీ

ప్రజా భూమి ప్రతినిధి రాజమహేంద్రవరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలలో సోమవారం నుండి డిగ్రీ, బీఈడీ, లా పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాల్లో నిర్వహణ ఏర్పాట్లును వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ శనివారం పరిశీలించారు. రాజమహేంద్రవరంలోని ఎస్.కె.వి.టి డిగ్రీ కాలేజ్, రాజమహేంద్రీ మహిళా డిగ్రీ కాలేజ్ కేంద్రాలను వీసీ పరిశీలించారు. రాష్ట్రంలోని ఉన్నత విద్యలో ఎక్కువ మంది మన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో పరీక్షలు వ్రాస్తారని, కాబట్టి పరీక్షల నిర్వహణపై కళాశాలల యాజమాన్యాలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా వేసవి కాలం కావడంతో తాగునీరు అందుబాటులో ఉంచాలని, కరెంట్ సమస్యలు లేకుండా, శుభ్రమైన వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలని తెలియజేశారు. పరీక్షా కేంద్రాల్లో నియమ నిబంధనలు పాటిస్తూ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పరీక్షలు నిర్వహించాలని, ఏదైనా సమస్య తలెత్తితే సంబంధిత పరీక్షా కేంద్రం పై కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. పరీక్షలు చక్కని వాతావరణం లో పారదర్శకంగా జరిగే విధంగా నిర్వాహకులు పర్యవేక్షించాలన్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాల్లలో




డిగ్రీ 4,6 సెమిస్టర్స్ పరీక్షలు జరుగుతున్నాయని ఈ పరీక్షలు ఉమ్మడి గోదావరి జిల్లాలోని 109 కేంద్రాల్లో సుమారు 22 వేల మంది విద్యార్థులు పరీక్షలు వ్రాస్తారన్నారు. అలాగే బీఈడీ బీపీఈడీ డీపీఈడీ 1 సెమిస్టర్ పరీక్షల నిమిత్తం 20 కేంద్రాల్లో రెండు వేల ఐదు వందల మంది, లా 8,10 సెమిస్టర్ పరీక్షలకు 3 కేంద్రాల్లో ఐదు వందల మంది పరీక్షలకు హాజరవుతారని చెప్పారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అన్ని పరీక్ష కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లును కళాశాలల నిర్వాహకులు పర్యవేక్షించాలని తెలియజేశారు.ం

# చిన్నకొత్తపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు

ప్రజా భూమి ఒంటిమిట్ట:



మండలంలోని చిన్నకొత్తపల్లి గ్రామంలో శనివారం శ్రీ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఉచిత వైద్య శిబిరం మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు, సామాజిక సేవకులు, రాజకీయ ప్రముఖులు పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు సహకరించారు. ఈ వైద్య శిబిరాన్ని రమాదేవి హాస్పిటల్ నుండి డాక్టర్ వెంకటరమణ నేతృత్వంలో నిర్వహించారు. గ్రామ ప్రజలకు కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, దయాబెటాలజీ, న్యూరాలజీ, ల్యాపరోస్కోపిక్ సర్జరీ వంటి విభాగాల్లో నిపుణులైన వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రమాదేవి హాస్పిటల్ ప్రతినిధులు మాట్లాడుతూ, "గ్రామీణ ప్రజలకు అధునాతన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఇలాంటి శిబిరాలను నిర్వహిస్తున్నాం. భవిష్యత్తులో మరిన్ని గ్రామాల్లో కూడా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం" అని తెలిపారు.

**గ్రామ ప్రజల అపూర్వ స్పందన**: ఉదయం 10 గంటల నుండి కొనసాగిన ఈ శిబిరానికి గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గ్రామ ప్రజలకు అత్యాధునిక ల్యాబ్ పరీక్షలు, మెడికల్ కౌన్సెలింగ్, ఉచిత మందుల పంపిణీ వంటి సేవలు అందించబడ్డాయి. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తమ ఆరోగ్య పరిస్థితిని సమీక్షించుకున్నారు.

# ఆదరణ పథకం అవగాహనా కార్యక్రమం - మండల అభివృద్ధి అధికారివెంగముని రెడ్డి

ప్రజాభూమి:బ్రహ్మంగారి మఠం



బ్రహ్మంగారిమఠం మండలం లోని పంచాయతీల వారిగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆదరణ పథకం కులవృత్తుల వారి పనిముట్ల కొరకు యూనిట్లు మంజూరు చేసేందుకు గ్రామ పంచాయతీల వారీగా గుర్తించాలని శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు సచివాలయం సిబ్బంది కలిసి అవగాహన కార్యక్రమాన్ని మండల అభివృద్ధి అధికారి వెంగముని రెడ్డి చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ఆదరణ పథకం ద్వారా ప్రభుత్వం నుండి వచ్చే పథకాలను అందే విధంగా చూడాలని ప్రతి మండలానికి ప్రతి గ్రామానికి చేరవేసే విధంగా చూడాలని ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ అనుమతితో మండలంలో ప్రతి పంచాయతీలోప్రతి గ్రామంలో ఉన్న బీసీల గుర్తించాలని వారికి ప్రభుత్వం మంజూరు చేసే ఆదరణ పథకం బీసీలకు అందాలనే లక్ష్యంతో పంచాయతీ కార్యదర్శులకు సచివాలయం సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని ఈ పథకం గురించి తెలియని వారికి తెలిపి తగు సూచనలు సలహాలను ఇవ్వాలని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలోఆఫీస్ ఏవో మల్లికార్జున రావు విస్తరణ అధికారి (ఈవో%ఢ%పీఆర్డి) సురేష్ బాబు ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్, సుజంద్ర, కార్యదర్శులు సచివాలయం సిబ్బంది, ఆదరణ పథకానికి వచ్చిన లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ ప్రణాళిక సమావేశం

ప్రజాభూమి, పులివెందుల




పులివెందుల పట్టణంలోని ఏపీ కార్ల్ లో కడప, అన్నమయ్య ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్వీ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ ప్రణాళిక సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీడు భూములు నవధాన్యాలను వేసుకుని వాటిని 60 రోజులకి భూమిలోకి కలుపుకోవడం వలన భూమి సారవంతం వచ్చి కర్బన శాతం అనేది పెరిగి భూమిలో సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది మంచి పంటలు వస్తాయని అన్నారు రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ తాళం విజయ్ కుమార్ ముఖ్యమంత్రి ఆశయం ప్రతి ఒక్క రైతు కూడా ఎలాంటి రసాయనాలు వాడకుండా ప్రకృతి పరంగా దొరికే ఆవు పేడ మూత్రంతో ఘనజీవా మృతం ద్రవజీవామృతం వాడుకుని పంటలు పండించాలని పురుగులు తెగులకు ద్రావణాలు కషాయాలు వాడుకుని పెట్టుబడిని తగ్గించుకొని దిగుబడి పెంచుకోవాలని ప్రతి సిబ్బంది కూడా వారి కేటాయించిన గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించి రసాయన రహిత ఆంధ్రప్రదేశ్ గా చేయాల న్నది ప్రభుత్వం ఉద్దేశమని అన్నారు.ఈ కార్యక్ర మంలో ఎన్ ఎఫ్ ఏ చంద్రమౌలేశ్వర్ రెడ్డి, రాజ్ కుమార్, మేరీ,లోకేష్, చిరంజీవి, నరసింహారెడ్డి, రమణ నాయక్, భాస్కర్ రెడ్డి, శ్యామ్, వెంకటేశ్వర రెడ్డి, వెంకట్రాంరెడ్డి, ప్రతాప్, శ్రీలక్ష్మి, నూర్జహత్, ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

# బ్రహ్మసాగర్ పై కంపెచెట్ల తొలగింపు

ప్రజాభూమి:బ్రహ్మంగారిమఠం



బ్రహ్మంగారి మఠం లో గల బ్రహ్మసాగర్ రిజర్వాయర్ పై దట్టంగా పెరిగిపోయిన కంపచెట్లను తొలగిస్తున్నట్లు తెలుగు గంగ ప్రాజెక్టు ఎ ఇ ఇ నాగేశ్వర రావు తెలిపారు. ఈ సందర్భముగా నాగేశ్వర రావు మాట్లాడుతూ బ్రహ్మం గారిమఠంలో నిర్మించిన తెలుగుగంగ ప్రాజెక్టు పై చాలా రోజుల నుండి కంపచెట్లు మొలచి దట్టంగా పెరిగి పోవడం జరిగిందని. దానితో నేను పై అధికా రుల దృష్టికి తీసుకెళ్లి, అధికారుల అనుమతులతో గత పదకొండు రోజుల నుండి జేసిబి సహాయం తో కంపచెట్లను తొలగిస్తున్నామని అయన తెలిపారు. కంప చెట్లు తొలగించే పనులను డి ఇ ఇ మురళీ మోహన్ కుమార్ పరిశీలించారు. అని బ్రహ్మంగారి మఠం తెలుగు గంగ ప్రాజెక్టు ఎ ఇ ఇ నాగేశ్వర రావు తెలిపారు.

# వైభవంగా ఒంటిమిట్ట కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

**ఏప్రిల్ 6 నుండి 14వ తేదీ వరకుఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి**

ప్రజాభూమి ఒంటిమిట్ట:






ఆంధ్రుల అయోధ్యగా పేరుగాంచిన శ్రీ ఒంటిమిట్ట కోదండ రామాలయంలో శ్రీరామ నవమి సందర్భంగా బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగవున్నాయిఏప్రిల్ 11న సాయంత్రం 6.30 నుండి రాత్రి 8.30 గంటల వరకు శ్రీ సీతారాముల కల్యాణంఏప్రిల్ 1న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కడప జిల్లా ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో ఏప్రిల్ 6 నుండి 14వ తేదీ వరకు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా జరుగనున్నాయి.ఇందులో భాగంగా ఆలయంలో ఏప్రిల్ 1న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, ఏప్రిల్ 5న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నిర్వహిస్తారు.

బ్రహ్మోత్సవాలలో ప్రతి రోజు ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహన సేవలు జరుగుతాయి."ఏప్రిల్ 15వ తేదీ సాయంత్రం 6 నుండి రాత్రి 9 గంటల వరకు పుష్పయాగం వైభవంగా నిర్వహించనున్నారు.

# అంగన్వాడీలకు పోషణ్ భీ పడాయి భీ శిక్షణ కార్యక్రమం

**పోషకాహారంతో పాటు చిన్నారులకు విద్యను అభ్యసించండి సిడిపిఓ ఎన్ శోభారాణి**

ప్రజా భూమి ఒంటిమిట్ట:





ఒంటిమిట్ట,సిద్ధవటం మండలాల పరిధిలో ఉన్న అంగన్వాడీ కార్యకర్తలకు ఒంటిమిట్ట మండల ఎంపీడీవో సభా భవనం నందు కడప ప్రాజెక్టు సి డి పి ఓ ఎన్ శోభారాణి ఆధ్వర్యంలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ శిక్షణా కార్యక్రమంలో ఐ సి డి ఎస్ సూపర్వైజర్ బి పద్మజ మాట్లాడుతూ ఆధార్ షీలా, నవ చేతన అనే రెండు విధాలుగా శిక్షణ ఇచ్చారు పోషణ్ భీ పడాయి భీ కార్యక్రమాన్ని న్యూఢిల్లీలో 2023 మే 10వ తేదీన విజ్ఞాన్ భవన్ నందు స్థాపించడం జరిగింది. ప్రధానంగా పోషణ్ భీ పథకం కింద వివిధ సేవలు అందిస్తున్నాయి ఈ సేవలో పోషకాహార పదార్థాల పంపిణీ ఆరోగ్య పరీక్షలు మరియు పోషకాహార అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు గర్భిణీ స్త్రీలు, బాల్యంతాలు మరియు సున్నా నుండి ఆరు సంవత్సరాల పిల్లల పోషకాహార అవసరాలను తీర్చడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది ఈ పథకం ద్వారా అంగన్వాడి కేంద్రాలు పోషకాహార సేవలను అందజేస్తాయి తద్వారా సమాజంలో పోషకాహార లోపాలను తగ్గించడంలో సహకరిస్తాయి పడాయి భీ అలాగే సున్నా నుండి ఆరు సంవత్సరాల పిల్లలకు విద్యను అభ్యసించడం లాంటి కార్యక్రమాల గురించి వివరించారు ఈ కార్యక్రమంలో ఏ వరలక్ష్మి దేవి ఆర్ శ్రీవిద్య సూపర్వైజర్లు సిద్ధవటం ఒంటిమిట్ట అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# కోవరంగుట్టపల్లి ప్రాథమిక పాఠశాలలో ముందస్తు ఉగాది సంబరాలు

ప్రజాభూమి, పులివెందుల



సింహాద్రిపురం మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కోవరంగుట్టపల్లిలో విద్యార్థు లు,ఉపాధ్యాయులు కలిసి పాఠశాల వార్షికోత్సవం, ముందస్తు ఉగాది పండగ సంబరాలను ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమంలో ముందుగా పాఠశాల ప్రాంగణంను విద్యార్థులు ఆకర్షణీయంగా వేసిన అందమైన రంగవల్లులు,మామిడి తోరణాలు, టెంకాయపట్టలు, అరటిపిలకలతో అందంగా అలంకలంకరించారు.అనంతరం ప్రధానోపాధ్యా యులు రామసుబ్బారెడ్డిఆధ్వర్యంలో ఉపాధ్యా యులు అంగడి నాగేంద్ర, ప్రశాంతి, లక్ష్మి గౌరి, అంజలి, పాఠశాల విద్యార్థుల చేత గణపతి, కలశ, సరస్వతీ పూజ కార్యక్రమం చేయించిన తర్వాత విద్యార్థులందరికి ఉగాది పండగ ప్రాశస్త్యాన్ని వివరిస్తూ ప్రతి సంవత్సరం చైత్రమాసం శుక్లపక్షం పాడ్యమితిథి నాడు నూతన తెలుగు సంవత్సరం ప్రారంభం అవుతుం దన్నారు.ఉగాది పర్వదినం జరుపుకొంటారని,ఉగాది పచ్చడి మన జీవితం లోని సుఖదుఖాలను, మంచిచెడులను సమానం గా స్వీకరించాలని గుర్తు చేస్తాయని షడ్రుచుల సమ్మేళనం అయిన ఉగాది పచ్చడి విశిష్టతను విద్యార్థులకు తెలియ జేశారు.అనంత రం ఉగాది పచ్చడి తయారు చేసి విద్యార్థుల కు అందరికి పంచిపెట్టారు అలాగే అంగడి నాగేంద్ర సౌజన్యంతో పాఠశాలలోని విద్యార్థులలో ఈ సంవత్సరంలో జరిగిన పరీక్షలలో ప్రతి తరగతిలో అత్యధిక మార్కులు తెచ్చుకొన్న నలుగురుకి ఆకర్షనీయమైన బహుమతులను,మిగతా విద్యా ర్థులకు విద్యాసామాగ్రి ని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ లు శివకుమార్, పావని, కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ సురేంద్రనాథ రెడ్డి ు పాల్గొన్నారు.

# క్రికెట్ బెట్టింగ్ పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాభూమి, పులివెందుల



ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ ప్రారంభం అయిన నేపథ్యం లో పట్టణంలో ఎవరైనా క్రికెట్ బెట్టింగ్ కు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ నర సింహులు అన్నారు.జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, డిఎస్పి మురళి నాయక్ ఆదేశాలతో ఐపిఎల్ క్రికెట్ బెట్టింగులు నిర్వహించే ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని అన్నారు. క్రికెట్ బెట్టింగుల వ్యవహారా లను పసిగట్టేందుకు ప్రత్యేక బృందాన్ని నియమిం చినట్లు ఆయన తెలిపారు.వారు అన్ని గ్రామాలలో, పలు ప్రాంతాలలో సంచరిస్తూ బెట్టింగ్ వ్యవహారా లను గమనిస్తూ ఉంటారన్నారు. బెట్టింగ్ లకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపడతామని తెలిపారు. గతంలో క్రికెట్ బెట్టింగులు నిర్వహించే వారిపై గట్టి నిఘా ఉంచా మన్నారు. అలాగే బెట్టింగ్ యాప్ లు అధికమైన నేపథ్యంలో తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ను గమనిస్తూ ఉండాలని ఆయన సూచించారు. బెట్టింగ్ యాప్ లతో కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. ఎవరైనా క్రికెట్ బెట్టింగులు నిర్వహిస్తున్నారని తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

# ఓర్వకల్లు అభివృద్ధికి కృషి చేస్తానన్న పవన్ కళ్యాణ్ - జనసేన నేత దాసరి రవిశంకర్

ప్రజాభూమి, వేంపల్లె



అంతర్జాతీయ జల దినోత్సవం సందర్భంగా శనివారం కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పుడిచర్ల గ్రామంలో రాష్ట్రవ్యాప్తంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ 1.55 లక్షల ఫారం పాండ్స్ త్రవ్వకాలకు శంకుస్థాపన చేసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. మే నెలాఖరు నాటికి రాష్ట్రంలో 1.55 లక్షల వ్యవసాయ నీటి కుంటలు త్రవ్వకం జరిగేలా పంచాయతీ రాజ్ ప్రిన్సిపాల్ సెక్రటరీ శశిభూషన్ కుమార్, పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ కృష్ణతేజ లకు ఆదేశాలు జారీ చేశారు. 1.55 లక్షల నీటి కుంటలు వర్షాకాలంలో నిండితే దాదాపు 1 టిఎంసి నీటి నిల్వ సమానమైన నీరు నిల్వ చేసుకోవచ్చున్నారు. పెద్ద జలాశయాలు పూర్తయ్యేలోపు ఇలాంటి నీటి కుంటలు రాయలసీమ లాంటి నీటి వనరులు సమృద్ధిగా లేని ప్రాంతాలలో నీటి కొరత తీరుస్తాయని, పల్లెపండుగలో 100 % రోడ్ల నిర్మాణం పూర్తి చేసిన జిల్లాగా కర్నూలు రికార్డు సాధించింది. జిల్లా యంత్రాంగానికి ప్రత్యేక అభినందనలు కొణిదల గ్రామానికి గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ దత్తత తీసుకుని, ప్రభుత్వ పనులే కాకుండా, సొంత ట్రస్ట్ ద్వారా రూ.50 లక్షల విలువైన అభివృద్ధి పనులు చేయించేలా హామీ ఉపాధి హామీ కూలీల శ్రమను గుర్తిస్తూ వారికి ప్రత్యేక అభినందనలు తెలిపినట్లు దాసరి రవిశంకర్ చెప్పారు.

# హత్య సినిమా టీం పై ఫిర్యాదు.. ఐదు మందిపై కేసు నమోదు

ప్రజాభూమి, పులివెందుల

హత్య సినిమాలో తనను,తన తల్లిని అవమానిం చే విధంగా, క్రూరంగా సన్నివేశాలు చిత్రీకరించారని సునీల్ యాదవ్ ఫిర్యాదు మేరకు ఐదు మంది పై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ నరసింహులు తెలిపారు. హత్య సినిమా తీసిన డైరెక్టర్, నిర్మాత, రచయితల తో పాటు ఈ చిత్రంలోని సన్నివేశాలను సోషల్ మీడియాలో, వాట్సప్ గ్రూప్?ల్లో వైరల్ చేసిన పవన్ కుమార్? పై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. పవన్ కుమార్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

# తాగునీటి సమస్యను పరిష్కరించండి

## - ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసి రెడ్డి

ప్రజాభూమి, వేంపల్లె



స్థానికంగా తాగునీటి సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏపిసిసి అధికార ప్రతినిధి డా.ఎన్ తులసిరెడ్డి అన్నారు. శనివారం తహసీల్దార్ హరినాథ్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం తులసిరెడ్డి మాట్లాడుతూ దాదాపు 40 వేలకు పైగా జనాభా కలిగి ఉన్న వేంపల్లెలో తాగునీటి సమస్య ఉత్పన్నం కావడం శోచనీయమన్నారు. ఇప్పటికే కొన్ని నీటి బోర్లు ఎండిపోయాయి.. రాబోయే రోజుల్లో మరిన్ని బోర్లు ఎండిపోవడం ఖాయంగా కనిపిస్తోందన్నారు. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అన్న చందంగా పక్కనే పాపాఘ్ని నది ఉన్నప్పటికీ వేంపల్లె ప్రజలు దాహార్తికీ గురికావడం శోచనీయమన్నారు. నది గర్భంలో అనేక అడుగుల లోతున ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయని, నది గర్భం నుండే చూట్టు ప్రక్కల గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోందని తెలిపారు. ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టి సారించి, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. వెలిగల్లు ప్రాజెక్ట్ నుంచి దిగువకు నీటిని విడుదల చేయాలని, అక్రమ ఇసుక తవ్వకాలు, నది ఆక్రమణలను అరికట్టాలని తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ధ్రువకుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణ, వేముల మండల అధ్యక్షుడు వెంకటేష్, చక్రాయపేట మండల అధ్యక్షుడు రామాంజనేయరెడ్డి, సుబ్రమణ్యం, అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న, వినయ్, బద్రీ, నాగరాజు, వేమారాజా, రమణ, రవి, వేమయ్య, సాయి, తదితరులు పాల్గొన్నారు.

# ఐదవ సెమిస్టరు ఫలితాల్లో మోడ్రన్ డిగ్రీ విద్యార్థులు టాప్.

ప్రజాభూమి, రామచంద్రపురం




ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఐదవ సెమిస్టరు ఫలితాల్లో రామచంద్రపురం పట్టణం లయన్ జి.వి.రావు మోడరన్ డిగ్రీ కాలేజీ బి.ఎస్.సి. విద్యార్థులు అత్యుత్తమ గ్రేడ్ పాయింట్లు సాధించి యూనివర్సిటీ టాపర్స్ గా నిలిచారు. ఈ ఫలితాల్లో 28మంది విద్యార్థులు 9 నుండి 9.8 గ్రేడ్ పాయింట్స్ సాధించడం విశేషం. ఈ సందర్భంగా శనివారం అందుబాటులో ఉన్న విద్యార్థులతో మోడరన్ విద్యాసంస్థల ప్రాంగణంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి వి రావు మాట్లాడుతూ....తమ విద్యార్థులు 28 మంది ఈ ఘనత సాధించి యూనివర్సిటీ టాపర్స్ గా నిలవడం చాలా అభినందనీయమైన విషయం అని అన్నారు. అభినందన సభలో సుమారు 15 మంది విద్యార్థులు పాల్గొన్నారని, మిగతా విద్యార్థులు వివిధ రాష్ట్రాల్లో ఇంటర్న్ షిప్, పీజీ కోర్సులు అధ్యయనం చేస్తున్నారని పేర్కొన్నారు. డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.... ప్రణాళికబద్ధమైన అకాడమిక్ షెడ్యూల్, అత్యుత్తమ బోధన తమ విద్యార్థులు టాపర్స్ గా నిలవడానికి దోహదం చేశాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టాపర్స్ ని మోడరన్ డిగ్రీ కాలేజ్ అకాడమిక్ డైరెక్టర్ కె. సాయిరాం చౌదరి, అధ్యాపక బృందం అభినందించారు.



ప్రజాభూమి



## కమలా హైస్కూల్ సి.బి.ఎస్.ఇ నందు అట్టహాసంగా ప్రీ ప్రైమరీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ వేడుకలు




ప్రజాభూమి మార్కాపురం

మార్కాపురం కమలా హైస్కూల్ సి బి ఎస్ సి.నందు ప్రీ ప్రైమరీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కమలా విద్యా సంస్థల కరస్పాండెంట్ పి పవన్ కుమార్ సింధుజ హాజరయ్యారు. పి.పవన్ కుమార్ మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తు కోసం కలలు కనాలని ఉన్నత శిఖరాలలో వారిని నిలబెట్టడానికి ప్రీ ప్రైమరీ నుంచే వారిని సిద్ధం చేయాలని సూచించారు. కమలా విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ శ్రీమతి.పి.సిందుజ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో వున్న పరిస్థితులను గమనించి నైపుణ్యాధారిత విద్య యొక్క ఆవశ్యకతను తెలుసుకొని ఈ తరం విద్యార్థులకు అవసరమైన విద్యను అందించాలని సూచించారు. కమలా హైస్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ స్వరూప్.రంజాన్మాట్లాడు తూజాతీయ విద్యా విధానంలో ఇది పునాది దశ అని ఈ దశలో ఆటల ఆధారిత విద్య మరియు కార్యకలాపాధారిత విద్య అవసరం అని సూచించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు మరియు విద్యార్థులు చాలా ఆసక్తిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అంతేకాకుండా తల్లిదండ్రులు ఉపాధ్యాయ బృందాలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## నాగెల్లముడుపు సర్పంచ్‌కు మాజీ ఎమ్మెల్యే అన్నా పరామర్శ



ప్రజాభూమి, మార్కాపురం

మార్కాపురం నియోజకవర్గం లోని తర్లుపాడు మండలం నాగెల్లముడుపుగ్రామ సర్పంచ్ బాల సుబ్బమ్మకు మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త అన్నా రాంబాబు పరామర్శించారు. గత కొంతకాలంగా సర్పంచ్ అనారోగ్యంతో బాధపడుతున్నారు ఎండలకు జాగ్రత్తగా ఉండాలనీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని సర్పంచ్ కు అన్నా సూచించారు.అన్నా వెంట ఎంపీపీ రామసుబ్బారెడ్డి,వైస్ ఎంపీపీ సుజాత తిరుపాల్,మండల పార్టీ అధ్యక్షులు మురారి వెంకటేశ్వర్లు, గొల్లపల్లి సర్పంచ్ రామిరెడ్డి,తాడివారిపల్లె సర్పంచ్ జాన్ రత్నం, ఎంపీటీసీ రమేష్ రెడ్డి,పార్టీ సీనియర్ నాయకులు బాలగురవారెడ్డి, అంజయ్య, మల్లారెడ్డి, రంగారెడ్డి,శేషయ్య, చిన్న పోలు, తదితరులవున్నారు.

## వాసవి విద్యానికేతన్ నందు శక్తి టీమ్ వారి శిక్షణ




ప్రజాభూమి మార్కాపురం

మార్కాపురం వాసవివిద్యానికేతన్ నందు డైరెక్టర్, ప్రిన్సిపాల్ కె రంగ య్య ఆధ్వర్యంలో టూ టౌన్ ఎస్ఐ.డా. రాజమోహన్ రావు ఆదేశాలను అనుసరించి వారి సిబ్బంది రవి, నాయక్ మరియు పావని మరియు కరాటి మాస్టర్ శ్రీనివాస రెడ్డి పర్యవేక్షణ లో శక్తి టీమ్ వారు వాసవి విద్యానికేతన్ విద్యార్థినులకు ఆత్మ సంరక్షణ మీద శిక్షణ ఇచ్చారు. అత్యవసర పరిస్థితులలో ఏ విధంగా సెల్ఫ్ డిఫెన్స్ చేసుకోవాలో శ్రీనివాసరెడ్డి తర్ఫీదు ఇచ్చారు. అదే విధంగా సుమారు 40 మంది పైనీ మహిళా ఉపాధ్యాయినులకుఎస్ ఓ ఎస్ యాప్.ను. డౌన్లోడ్ చేపించిఅందులోఉన్నఅత్యవసరమైన నంబర్లు 112, 181, సైబర్ క్రైమ్ నేరాలకు 1930, 24 గంటలు అందుబాటులో ఉండే 1098 లకు ఏ విధంగా కంప్లైంట్ ఇవ్వాతో పోలీస్ సిబ్బంది అయిన పావని వివరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపల్ కె. రంగయ్య ఇటువంటి శిక్షణలు మహిళా సిబ్బందికి మరియు విద్యార్థినులకు అందించినందుకు ప్రత్యేకధన్యవాదాలు తెలిపారు.

## 24,25 వ తేదీల్లో విద్యుత్ సదస్సులు




ప్రజాభూమి,రామచంద్రాపురం

24 సోమవారం, 25 మంగళవారం రెండు రోజులు రామచంద్రపురం మండలంలో విద్యుత్ సరస్సులను నిర్వహిస్తున్నట్లు మండల విద్యుత్ ఏఈ గిరి అన్నారు. 24వ తేదీ ఉదయం 9 గంటలకు కుప్పంబాదూరు, సాయంత్రం 4 గంటలకు నెత్త కుప్పం, 25 వ తేది ఉదయం 9 గంటలకు వెంకట రామాపురం, సాయంత్రం 4 గంటలకు నడవలూరు విద్యుత్ సబ్ స్టేషన్లలో విద్యుత్ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ యొక్క విద్యుత్ సదస్సులకు ఈఈ ఆశీర్వాదం, ఏడిఈ శంకరయ్య, మండల విద్యుత్ అధికారులు పాల్గొంటారన్నారు. మండల ప్రజలు రైతులు, వ్యాపారస్తులు విద్యుత్ సేవలపై వారి సమస్యలను తెలియపరచి పరిష్కారం పొందవచ్చని తెలిపారు ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## బిజెపి మండల కమిటీ సభ్యులు నియామకం
### పలువురు బిజెపి లో చేరిక



ప్రజాభూమి,రామచంద్రాపురం

రాష్ట్ర బిజెపి అధిష్టానం ఆదేశాల మేరకు బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు జనార్దన్ నాయుడు మండల కమిటీ సభ్యులు జాబితాను ప్రకటించారు అందులో భాగంగా ఉపాధ్యక్షులు గా చండీశ్వర్ రెడ్డి, గిరిజా రాణి, హరిప్రసాద్, శివశంకర్ రెడ్డి, కుమార్, భాగ్యలక్ష్మి, జనరల్ సెక్రటరీలుగా ప్రసాద్, గోపి నాథ్, సెక్రటరీ లు శివా, నాగరాజు, రాజశేఖర్, రమాదేవి, మౌనిక, కృష్ణమూర్తి, కోశాధికారి రామకృష్ణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ లుగా రోసిరెడ్డి, ముని ప్రసాద్, డిల్లీ రెడ్డి, చిరంజీవి, తేజ లను మండల కమిటీ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు ఈ కార్యక్రమం రాయలు చెరువు కట్ట దిగువ ఉన్న రాయలు మండపంలో అధ్యక్షులు ఆధ్వర్యంలో కార్యకర్తలు సమావేశం ఏర్పాటు చేశారు అనంతరం మండలంలోని నడవలూరు గ్రామానికి చెందిన కృష్ణ మూర్తి,ఎన్ ఆర్ కమ్మపల్లి చెందిన రాజేశ్వరి,కట్టకింద వెంకటాపురం కు చెందిన తేజాలకు జనార్ధన్ నాయుడు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారుఈసందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రధాన మంత్రి మోడీ నాయకత్వాన్ని బలపరిచేందుకు బిజెపి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు అడుగుజాడలులో నడిచేందుకు నడుమ బిగించాలని పార్టీ సిద్ధాం తాలను ప్రతి ఒక్కరు గౌరవించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ప్రభాకర్ నాయుడు, మునెయ్య, గోపి నాగిరెడ్డి, శివశంకర్ రెడ్డి, రోసి రెడ్డి, రామకృష్ణారెడ్డి ,పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెన్నకేశవ స్వామి దేవస్థానంలో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

### ఈవో శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేసిన బిజెపి నాయకులు



ప్రజాభూమి మార్కాపురం

మార్కాపురం చెన్నకేశవ స్వామి గుడి ఈవో.శ్రీనివాస్ రెడ్డి ని కలవడం జరిగింది. విషయము, మన దక్షిణ భారత దేశంలో, శ్రీకృష్ణ దేవరాయలు, పూర్వకాలం లో దేవాలయాలు, గాని అలాగే చెరువులు, గాని కట్టడం జరిగింది, కానీ ఈరోజు మన మార్కాపురంలో అతిపెద్ద దేవాలయము, చెన్నకేశవ స్వామి దేవాలయం కానీ ఎవరు కట్టించారు, ఎప్పుడు కట్టించారు, అనే విషయం మీద ఎవరికీ అవగాహన లేదు. ఇప్పుడు చూస్తున్నాము కొత్త జనరేషన్ ,లో పూర్వకాలంలో జరిగిన పురాతన కట్టడాల గురించి, ఎవరికీ తెలియదు. మార్కాపురం, చెన్నకేశవ స్వామి, దేవాలయం శ్రీకృష్ణదేవ రాయలు, రాజుల యుగంలో, కట్టించినందుకు ఈరోజు, ఆయన గుర్తింపుకు చెన్నకేశవ స్వామి దేవాలయం లో,గుర్తింపు గా స్థూపము, తయారు చేయాలని, చెన్నకేశవ స్వామి గుడి ప్రాంగణంలో పెట్టాలని, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకురాలు, జాతీయ కౌన్సిల్ సభ్యులు. శాసనాలసరోజిని అదేవిధంగా నాయకులు. విన్నవించు కోవడం జరిగింది,అదేవిధంగా రాబోయే చెన్నకేశవ స్వామి తిరుణాల జరగబోతుంది రాబోయే భక్తులకు ఫ్రీ ,దర్శనం, కొంత సమయము ఇవ్వాలని, కోరుచూ అదేవిధంగా, వేసవి కాలం కావడం గనక భక్తులకు త్రాగునీరు కొరత ఉండ కూడదని, ఒక వినతి పత్రము ఈవో గోలమారి శ్రీని వాసరెడ్డికి సమర్పించు కోవడం జరిగింది.జిల్లా సెక్రెటరీ ముర్రి బోయిన చిన్నయ్య జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి మద్దెల లక్ష్మీదేవి అలాగే కడియం రామయ్యపి కామేశ్వరరావు పైసా అని నాగేశ్వరరావు మురళి గురుమూర్తిగ. సింగరి సత్య నారాయణ గసుబ్బారావు గోనుగుంట్ల శ్రీధర్ పాల్గొన్నారు.

## వేసవిలో వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలి:డాక్టర్ తేజస్విని



ప్రజాభూమి, రామచంద్రపురం

రామచంద్రాపురం మండలం కుప్పం బాదురు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బొప్పరాజు పల్లి గ్రామంలో 104 ఆరోగ్య సేవల కార్యక్రమంలో భాగంగా కుప్పం బాదురు ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ తేజస్విని ఆధ్వర్యంలో వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవికాలం లో రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగు తున్నందువలన వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వృద్ధులు పెద్దలు పిల్లలు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో తిరగ కుండా ఇంటి పట్టునే ఉండాలని అన్నారు. ఏమైనా పనులుంటే ఉదయం 10 నుండి 11 గంల లోపే చూసుకోవాలని బయటికి వెళ్ళాల్సి వస్తే గొడుగు, టోపి, తలపాగా వంటివి తలకు రక్షణ గా ధరించాలని తెలిపారు. మంచి నీళ్ళు, ఉప్పు కలిపిన మజ్జిగ, ఓ ఆర్ ఎస్ పానీయం వంటివి అధికంగా తీసుకోవాలని తెలిపారు. మాంసాహారం తగ్గించి శాఖాహారం అధికం గా తీసుకోవాలన్నారు. పుచ్చకాయలు, దోస కాయలు వంటి శరీరానికి చలువ చేసే పండ్లు తో బాటు పండ్ల రసాలు తీసుకుంటే మంచిదన్నారు. పలుచటి కాటన్ దుస్తులు ధరించాలని తెలిపారు. నీరసం, కళ్ళు తిరగడం, తల నొప్పి, వాంతులు వంటి వడ దెబ్బ లక్షణాలు ఉంటే వారిని చల్లటి ప్రదేశం లో ఉంచి ప్రథమ చికిత్స చేసిన తరువాత వారిని వీలైనంత తొందరగా దగ్గర లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని తెలిపారు. ప్రతినిత్యం సచివాలయాల్లోనూ గ్రామాల్లోనూ ఆరోగ్య కార్యకర్తలు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిరణ్ కమార్ , సుబ్బలక్ష్మి , ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## రెండు పాములు 80 పాము పిల్లలు మార్కాపురంలో చోటు చేసుకున్న అరుదైన ఘటన

ప్రజాభూమి మార్కాపురం

మార్కాపురం పట్టణ కొండేపల్లి రోడ్డు మరియు డ్రైవర్స్ కాలనీ సమీపంలోని పొదల్లో ఉండటానికి గమనించిన స్థానికులు అడవి శాఖ స్నేక్ క్యాచర్ ఎస్.కె నిరంజన్ కు సమాచారం ఇవ్వడంతో ఆయన హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని 120 పాము గుడ్లు పెట్టి ఉండటాన్ని చూసి అడవి శాఖ కార్యాలయం తరలించిఅడవిశాఖ అధికారులు పాములను గుడ్లతో పాటు అటవీశాఖకార్యాలయంలోని గదిలో భద్రపరిచి ఈ రెండు.పాములకుచెందిన120గుడ్లను వేరు వేరుగా రెండు డబ్బాల్లో ఇసుకలో కప్పి పెట్టి పొదిగించిన స్నేక్ క్యాచర్ నిరంజన్.రికార్డు స్థాయిలో రెండు పాములకు చెందిన గుడ్ల నుండి పొదిగిన 80 పాముపిల్లలు.ఇవి అన్ని బ్రతికి సురక్షితంగా ఉండటంతో సమీప అటవీ ప్రాంతంలో వాటిని వదిలి పెట్టిన అటవీ శాఖ అధికారులు తెలిపారు




## 25న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి పుష్పయాగం..!



ప్రజాభూమి, చంద్రగిరి:

శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మార్చి 25వ తేదీన శాస్త్రోక్తంగా పుష్పయాగంజరుగనుంది. ఇందుకోసం మార్చి 24వ తేదీ సాయంత్రం 6నుండి 8గంటలవరకుఅంకురార్పణ నిర్వహిస్తారు. ఆలయంలో ఫిబ్రవరి 18 నుంచి 26వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరిగిన విషయం తెలిసిందే. బ్రహ్మోత్సవాల్లో అర్చక పరిచారకుల వల్ల, అధికార అనధికారుల వల్ల, భక్తుల వల్ల తెలియక ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగంనిర్వహిస్తారు. ఈ యాగం నిర్వహణ వల్ల సమస్తదోషాలుతొలగిపోతాయని విశ్వాసం.ఇందులో భాగంగా మార్చి 25న ఉదయం 10 నుండి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేస్తారు. మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు పుష్పయాగంజరుగనుంది. ఇందులో తులసి, చామంతి, గన్నేరు, మొగలి, మల్లె, జాజి సంపంగి, రోజా, కలువలు వంటిపలురకాలపుష్పాలతో స్వామివారికి అభిషేకం చేస్తారు.శ్రీవారి పుష్పయా గాన్ని పురస్కరించుకుని మార్చి 25నస్వర్ణపుష్పార్చన, నిత్య కల్యాణోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసింది.

## గంగమ్మ గుడి పెండింగ్ పనుల పూర్తికి టిటిడి అదనపు నిధులుః బోర్డ్ ఛైర్మన్, ఎమ్మెల్యే వెల్లడి..!




ప్రజాభూమి, చంద్రగిరి:

తిరుపతితాతయ్యగుంట గంగమ్మ గుడి పునర్నిర్మాణ పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేస్తామని టిటిడి బోర్డ్ ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వెల్లడించారు. ఆలయ ఆవరణలో జరుగుతున్న పెండింగ్ పనులను వారు శనివారం ఉదయం పరిశీలించారు. పెండింగ్ పనుల వివరాలను ఈఓ జయకుమార్, ఆలయ, టిటిడి ఇంజినీరింగ్ అధికారులు ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు వివరించారు. రెండు నెలల కిందట టిటిడి ఛైర్మన్ ను కలిసి గంగమ్మ గుడి ఆలయంలో పెండింగ్ పనుల పూర్తికి మూడు కోట్లా తొంభై లక్షల నిధులు కేటాయించాలని కోరినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఆలయంలో పెండింగ్ లో ఉన్న పోటు, ఆలయ ప్రాకారం పనులు, ముఖమండపం, మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు కావాలని కోరినట్లు ఆయన చెప్పారు. దీంతో ఛైర్మన్ బిఆర్ నాయుడు గంగమ్మ ఆలయాన్ని సందర్శించి పనులను పరిశీలించడంతో పాటు అమ్మవారిని దర్శించుకున్నారని ఆయన చెప్పారు. గంగజాతరను తిరుపతి వాసులు ఎంతో సాంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తారని ఆయన చెబుతూ గత ప్రభుత్వ పాలనలో ఇష్టారీతిన నిర్వహించారని ఆయన విమర్శించారు. గంగమ్మ ఆలయ పెండింగ్ పనుల పూర్తికి ప్రతిపాదనలు అందాయని వీటిపై ఈ నెల 24వ తేదీ బోర్డు మీటింగ్ లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని బోర్డ్ ఛైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. ఇప్పటికే మొదటి విడతలో 3.75 కోట్లు ఆలయ అభివృద్ధికి ఇచ్చినట్లు ఆయన చెప్పారు గంగజాతరను ఎంతో భక్తి భావంతో స్థానికులు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని ఆయన తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆలయ పనులు వేగవంతమైయ్యాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్యాప్ ఛైర్మన్ రవి నాయుడు, యాదవ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, టిటిడి బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కార్పొరేటర్లు ఎస్కే బాబు,నరసింహా ఆచ్చారి, నరేంద్ర, సికే రేవతి, కల్పనా యాదవ్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మబ్బు దేవనారాయణ రెడ్డి, దంపూరి భాస్కర్ యాదవ్, పులిగోరు మురళీ, మహేష్ యాదవ్, భరణి యాదవ్, హేమంత కుమార్ యాదవ్, దొడ్డరెడ్డి రామకృష్ణా రెడ్డి, దొడ్డరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి, సుధా, బాబ్జీ, సుభాషిణి, జిమ్ మురళీ, ఆముదాల వెంకటేష్, ఆకేపాటి సుభాషిణి, బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ , పొనగంటి భాస్కర్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పరిగెత్తే నీటిని నడిపించాలి - నడిచే నీటిని నిలబెట్టాలి.



ప్రజా భూమి గండేపల్లి.

జగ్గంపేట శాసనసభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ గండేపల్లి ఆంధ్రప్రభ ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గండేపల్లి మండలం కె గోపాలపురం గ్రామంలో నిర్మాణం చేసిన పంట నీటి కుంటలను శనివారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే కాలంలో భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం రాకుండా చుట్టూ ఉన్న ఏలేరు రిజర్వాయర్, సూరంపాలెం రిజర్వాయర్, భూపతిపాలెం రిజర్వాయర్ లతో పాటు పంట పొలాలలో ఏర్పాటు చేసుకొనే ఇటువంటి 10ఐ10 అడుగులు, లేదా 5ఐ5 అడుగుల పొడవు,వెడల్పుతో తయారు చేసుకొనే నీటి కుంటల వల్ల బోర్లు నీటి సామర్థ్యం కూడా పెరుగుతుందన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమాలలో పాల్గొనాలని ప్రజాప్రతినిధులందరికీ పిలుపునిచ్చారని అన్నారు.పంట నీటి కుంటలను ఏర్పాటు చేసుకున్న బుదిరెడ్డి నరసాయమ్మను అభినందించి, ఇలాగే మిగిలిన రైతులు కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజలంతా నీటి పొదుపును పాటించాలనీ, పడిన ప్రతీ వర్షపు నీటి బొట్టూ ,వాడిన ప్రతీ నీటి చుక్కా తిరిగి భూమిలో ఇంకేందుకు కృషి చేయాలని దిశానిర్దేశం చేసారు.ఈ సందర్భంగా స్థానిక నాయకులు అవసరాల బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గతంలో నెహ్రూ శాసనసభ్యులుగా ఉన్నప్పుడే కె గోపాల పురానికి ఎన్టీఆర్ జలసిరి ద్వారా రైతులకు 60 బోర్లు వేసారనీ, ఎంతో లోతులో గోతులతో ఉన్న పుంత రోడ్డును పనికి ఆహార పథకం ద్వారా రోడ్డు వేయించారనీ అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నాతి బుజ్జి, పోతుల మోహన రావు,అడబాల భాస్కరరావు, ఎర్రంశెట్టి బాబ్జి,జె గీతా రామ చంద్ర వర్మ,బాల సుబ్రహ్మణ్యం, ఏపీఓ గంగాభవాని, ఈసీ రమేష్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది, వేతనదారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు



Printed and Published and owned by A.RAMAMOHANREDDY,Printed at Mohaneeswar Publications, D.No. 11-12-124, Nawabpetcolony,3rd Division,Eluru - 534001.Andhra Pradesh and Published from D.NO. 11-12-124, Nawabpet colony, 3rd Division,Eluru - 534001, ANDHRA PRADESH. Editor :A.RAMAMOHANREDDY, Phone No. Cell : 9502116677